Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 243 మేడ్చల్ మల్కాజ్‌గిరి 22 సెప్టెంబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

## మహిళా బిల్లు కంటితుడుపు చర్య: బృందా కరాత్

చెన్నై : మహిళా రిజర్వేషన్ బిల్లు కంటి తుడుపు చర్య మాత్రమేనని సీపీఎం రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యురాలు బృందా కరాత్ విమర్శించారు. గడిచిన తొమ్మిదేళ్లలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పలు ప్రజా వ్యతిరేక బిల్లులను అమలు చేసిందని చెప్పారు. ఎన్నికల వేళ మహిళలకు 33% రిజర్వేషన్ బిల్లు నాటకం మొదలుపెట్టిందని ఆరోపించారు. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం బీజేపీ రాజకీయ గిమ్మిక్కు అని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా' కూటమి విజయం సాధిస్తుందని కరాత్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'గెలుపు గుర్రాలకే'

# టికెట్ల ఖరారుపై కాంగ్రెస్ హైకమాండ్ క్లారిటీ...!!



## వార్ రూమ్ లో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ

## టికెట్ కోసం నేతల టెన్షన్!!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలకు సమయం దగ్గర పడుతుంటే ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని గద్దె దించాలని ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నాయి. అయితే ఇటీవల బీజేపీని వెనక్కి నెట్టి తెలంగాణలో దూకుడు చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలను ప్రకటించి, ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఇక తాజాగా మరో అడుగు ముందుకు వేసిన కాంగ్రెస్ పార్టీ వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు తెలంగాణ రాష్ట్రంలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేసింది. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించింది. ఈ క్రమంలో స్క్రీనింగ్ కమిటీ వార్ రూమ్లో సమావేశం కానుంది. ఈ సమావేశంలో 35 చోట్ల అభ్యర్థులను ఫైనల్ చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. రక్షణ కల్పించండి మహాప్రభో– హిందువులు లేఖ దీంతో త్వరలోనే మొదటి విడత అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ పార్టీ ప్రకటించనుందని తెలుస్తుంది. అయితే ఈ జాబితాలో ఎవరికి స్థానం దక్కుతుంది అన్నది కాంగ్రెస్ పార్టీ వర్గాలలో ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో అధికార బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను ఫైనల్ చేసి ప్రకటించింది. చాలా చోట్ల సిట్టింగ్ ఎమ్మెల్యేలను అభ్యర్థులుగా ప్రకటించింది. ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజల మద్దతు పొందేలా పనిచేయాలని బీఆర్ఎస్ హై కమాండ్ దిశా నిర్దేశం కూడా చేసింది. ఈ క్రమంలో తాజాగా కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థుల ఎంపికపై ఫోకస్ పెట్టి ఆయా స్థానాలలో గెలుపు గుర్రాలను రంగంలోకి దింపేందుకు ప్రయత్నం చేస్తుంది. త్వరలో అభ్యర్థులని ప్రకటించి ప్రజా క్షేత్రంలోకి వెళ్లాలని భావిస్తుంది.

ఈ వారం మొదటి విడత జాబితా టికెట్ల ప్రకటన అంటూ ప్రచారం జరుగుతున్న క్రమంలో ఢిల్లీకి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు క్యూ కట్టారు. ఎవరికి వారు తమ అనుచరులకు టికెట్ల కోసం శత విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు.

అయితే ఈ సారి ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకం కావటంతో కాంగ్రెస్ మాత్రం విజయావకాశాలు ఉన్న నాయకులకే టికెట్లు ఇవ్వాలని భావిస్తుంది.

## పేదలు గౌరవంగా జీవించాలనే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం : మంత్రి తలసాని

హైదరాబాద్ : పేదలు గొప్పగా బతకాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేదలకు అందజేస్తున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లిలో వెయ్యి మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరంతరం పేద ప్రజల కోసం ఆలోచించే వ్యక్తి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండటం మన అదృష్టం అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వమే అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి ఉచితంగా అందిస్తున్నది. నగరంలో పేదల కోసం లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మిస్తుంది. దశల వారీగా అర్హులైన పేదలందరికి పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులకు ఇండ్లను కేటాయిస్తాం. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగింది. మొదటి విడతలో 11,700 మందికి ఇండ్లు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. రోండో విడతలో 13,200 మందికి ఇండ్లు కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సింగరేణి ఉద్యోగులకు గుడ్‌న్యూస్..

### 11వ వేజ్‌బోర్డ్ కింద రూ. 1,450 కోట్లు విడుదల

హైదరాబాద్ : ఉద్యోగులకు సింగరేణి యాజమాన్యం శుభవార్త అందించింది. 11వ వేజ్ బోర్డు ఏరియర్స్ విడుదల చేసింది.

మొత్తం 39,413 మంది సింగరేణి ఉద్యోగులకు రూ. 1,450 కోట్లు జమచేసింది. ఈరోజు మధ్యాహ్నం నుంచి కార్మికుల బ్యాంక్ ఖాతాలో ఏరియర్స్ జమ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ లెక్కన ఒక్కో కార్మికుడి



ఖాతాలో రూ. 3.70 లక్షల ఏరియర్స్ జమకానుంది. త్వరలో దసరా, దీపావళి బోనస్ చెల్లింపులకు కూడా సింగరేణి సిద్ధమైంది.

# అత్యంత పారదర్శకంగా 'డబుల్ ఇళ్ళ' పంపిణీ



## అర్హులందరికీ అందించే బాధ్యత మాదే - మంత్రి కేటీఆర్

హైదరాబాద్ : డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని.. ఏ ఒక్కరికీ ఒక్క పైసా ఇవ్వద్దని మంత్రి కేటీఆర్ తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్‌లో రెండో విడత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీని కేటీఆర్ ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో కట్టిన లక్ష డబుల్ బెడ్రూం ఇండ్లలో 30 వేల ఇండ్ల పంపిణీ ఇవాల్టితో పూర్తవుతుందని అన్నారు. మిగిలిన 70 వేల డబుల్ బెడ్రూం ఇండ్లను కూడా అత్యంత పారదర్శకంగా రాబోయే నెల, నెలన్నర కాలంలో పేదల చేతిలో పెడతామని తెలిపారు.

**పారదర్శకతకు ఇదే నిదర్శనం :** ' ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అని పెద్దలు చెబుతుంటారు. సొంతంగా ఇల్లు కట్టాలన్నా.. ఇంట్లో ఆడబిడ్డ పెండ్లి చేయాలన్నా కష్టమని పాతకాలంలో ఈ సామెత చెప్పేవారు. కానీ ఇవాళ తెలంగాణలో అద్భుతమైన అనుభూతి కలుగుతోంది. ఇల్లు నేనే కట్టిస్తా.. పెళ్లి నేనే చేస్తా.. ఆడబిడ్డకు మేనమామగా సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నరు.' అని అన్నారు. ' దుండిగల్‌లోని 4వేల ఇండ్లు కట్టేందుకు ఒక్కో ఇంటికి రూ. 10 లక్షల చొప్పున ఖర్చయ్యింది. లక్ష ఇండ్లు హైదరాబాద్‌లో కడితే 9,718 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఒక్కో డబుల్ బెడ్రూం ఇల్లు కట్టేందుకు ప్రభుత్వానికి అయిన ఖర్చు పది లక్షలు. కానీ లక్ష ఇండ్ల మొత్తానికి మార్కెట్ విలువ 50వేల నుంచి 60 వేల కోట్ల వరకు ఉన్నది. ఆ ఆస్తులను కేసీఆర్ ప్రభుత్వం పేదల చేతిలో పెడుతున్నది. ఒక్క రూపాయి లంచం చెల్లించాల్సిన అవసరం లేకుండా పారదర్శకంగా ఈ ఇండ్ల కేటాయింపులు చేశాం ' అని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా మొదటి విడత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో జరిగిన ఆసక్తికర విషయాన్ని వివరించారు. జగద్గిరిగుట్ట డివిజన్ 126వ డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కౌసల్యకు మొదటి విడతలో డబుల్ బెడ్రూం ఇల్లు వచ్చిందని.. అదే డివిజన్‌లోనే బీజేపీ నాయకురాలు సునీతకు కూడా మొదటి విడతలోనే ఇల్లు వచ్చిందని తెలిపారు.

**ఇప్పటికి 30 వేల ఇండ్ల పంపిణీ పూర్తి :** ఇవాళ దాదాపు 13,300 డబుల్ బెడ్రూం ఇండ్లు పంపిణీ చేస్తున్నాం. ఇవాల్టితో హైదరాబాద్‌లో కట్టిన లక్ష ఇండ్లలో 30వేల ఇండ్ల పంపిణీ ఇవాళ పూర్తవుతుంది. మిగతావి కూడా రాబోయే నెల, నెలన్నర కాలంలో ఇదే పద్ధతిలో.. ఇంతే పారదర్శకంగా మీ చేతులో పెడతాం. ' అని మంత్రి కేటీఆర్ అన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం ఏ ఒక్కరికీ ఒక్క పైసా ఇవ్వకండి అని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. కేసీఆర్ ఆలోచన మేరకు ఈ ఒక్క రోజు 8 ప్రాంతాల్లో పంపిణీ చేసిన 13300 ఇండ్లలో దివ్యాంగులకు 470, దళితులకు 1,923.. గిరిజనులకు 655, మిగిలినవారికి 8652 పంపిణీ చేశామని తెలిపారు. పంపిణీ చేసినం. అని వివరించారు.

**ఏ ఒక్క రాష్ట్రంలో అయినా ఇస్తున్నారా? :** ఇవాళ వచ్చేటప్పుడు పేపర్‌లో ఒక వార్త చూసిన. అర్హులేమో పెద్ద సంఖ్యలో ఉన్నరు. ఇస్తున్నవి సరిపోతలేవని అంటున్నరు. మీ అందర్నీ ఒక్కటే ఆలోచించమని చెబుతున్న. ఈ ప్రభుత్వం వచ్చి తొమ్మిదేండ్లు అయ్యింది. ఈ ప్రభుత్వం వచ్చినంక నీళ్ల వసతి బాగు చేసుకున్నం. రోడ్లు బాగు చేసుకున్నం. కరెంటు బాగు చేసుకున్నం. శాంతిభద్రతలను పటిష్టం చేసుకుని.. పెట్టుబడులను ఆకర్షిస్తూ దేశంలో నంబర్‌వన్ స్థానానికి వచ్చినం. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పనలో నంబర్‌వన్ స్థానంలో ఉన్నాం. హైదరాబాద్ నగరం శరవేగంగా విస్తరిస్తున్నం. కొత్త లింక్ రోడ్లు వేసుకుంటున్నం.. బ్రహ్మాండమైన నాలాలు ఏర్పాటు చేసుకుంటున్నం. ఎన్నో కార్యక్రమాలు చేసుకుంటున్నం. లక్ష డబుల్ బెడ్రూంల కోసం దాదాపు 9,718 కోట్లు ఖర్చు పెట్టినం. మా మీద విమర్శలు చేసే నాయకులను అడుగుతున్న. భారతదేశంలో ఇంకో 27 రాష్ట్రాలు ఉన్నాయి కదా ఎక్కడైనా ఒక్క రాష్ట్రంలో ఇంత అద్భుతమైన డబుల్ బెడ్రూం ఇండ్లు చూపిస్తారా అని మంత్రి కేటీఆర్ సవాలు విసిరారు. ఎక్కడైనా 560 చదరపు అడుగుల్లో రెండు పడక గదులు, రెండు బాత్‌రూంలు, ఒక హాలు, ఒక కిచెన్‌తో కూడిన డబుల్ బెడ్రూం ఇండ్లు ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ కానీ, బీజేపీలో కానీ ఎక్కడైనా ఉన్నదా? అని ప్రశ్నించారు. భారతదేశంలో ఏ నగరంలో కూడా ఇంత పెద్ద ఎత్తున బస్తీల రూపురేఖలు మార్చి స్ల

**అందరికీ ఇండ్లు ఇచ్చే బాధ్యత మాదే :** ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే మన జీవన ప్రమాణాలు బాగుపడుతున్నాయని.. కేసీఆర్ నాయకత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. అర్హులైన వారందరికీ ఇండ్లు ఇచ్చే బాధ్యత మాదేనని తెలిపారు. తప్పకుండా భవిష్యత్తులో వారందరికీ ఇచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఒకేసారి అందరికీ ఇవ్వాలని మాకు కూడా ఉన్నది. కానీ ఇన్ని కార్యక్రమాలు, మధ్యలో రెండేండ్లు కరోనాలాంటి సంక్షోభం. దానివల్ల ఆర్థిక పరిస్థితి కూడా దెబ్బతిన్నది. అయినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే రైతులకు రెండుసార్లు రుణమాఫీ చేసుకున్నం. రైతుబంధు కింద 73వేల కోట్లు రైతుల ఖాతాలో వేస్తున్నాం. దళితబంధు వంటి విప్లవాత్మక పథకం తెచ్చి దళితోద్ధరణలో భారతదేశానికే ఆదర్శంగా నిలిచాం. పారిశ్రామికీకరణ, కొత్త పరిశ్రమలు ఆకర్షించడంలోనూ ముందున్నాం. దుండిగల్‌కు కూడా కొత్త పరిశ్రమను తీసుకురాబోతున్నాం. ఈ ప్రాంతం రూపురేఖలు తప్పకుండా మారుస్తాం. అని మంత్రి కేటీఆర్ చెప్పారు.

# సంపాదకీయం

## అగ్ర రాజ్యంతో చైనా చిప్ వార్!

కంప్యూటర్లు ల్యాప్టాపులు ట్యాబ్లు సెల్ ఫోన్లు పనిచేయాలంటే సెమీ కండక్టర్లు చిప్ లు అవసరం ఎంతో. అవి లేకుండా ఎలక్ట్రానిక్ వస్తువులు పనిచేయవు. అదే జరిగితే టెక్నాలజీపైనే ఆధారపడ్డ సంస్థలు తీవ్రంగా నష్టపోకతప్పదు. అంతేకాకుండా దీని ప్రభావం ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలపైన తీవ్రంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచంలో 70 నుంచి 80 శాతం సెమీకండక్టర్లు చిప్ ల అవసరాలను తైవాన్ తీరుస్తోంది. అయితే తైవాన్ తమలో భాగమని.. తైవాన్ ను తమ దేశంలో కలిపేసుకుంటామని చైనా హెచ్చరికలు జారీ చేస్తోంది. అదే జరిగితే సెమీకండక్టర్లు చిప్ ల ఎగుమతిని చైనా ఆపేస్తే ప్రపంచ దేశాల వ్యవస్థలు కుప్పకూలడం ఖాయం. ఈ నేపథ్యంలోనే అగ్ర రాజ్యం అమెరికా ముందు జాగ్రత్త చర్యగా భారత్ లో భారీ ఎత్తున సెమీ కండక్టర్లు చిప్ ల తయారీకి పెట్టుబడులు పెట్టనుంది. ఈ మేరకు ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో ఒప్పందాలు కుదిరాయి. తైవాన్ బయట భారత్ అయితేనే చిప్ లు సెమీ కండక్టర్ల అవసరాలను తీర్చగలదని అమెరికా దాని మిత్ర దేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చైనా చిప్ వార్ మొదలుపెట్టింది. కంప్యూటర్ చిప్స్లో వినియోగించే అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా పట్టు బిగించింది. గాలియం జర్మేనియం వంటి ఖనిజాలను ప్రభుత్వ అనుమతి లేకుండా ఎగుమతి చేయడానికి వీల్లేదని ఆ దేశ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రపంచంలోనే ఈ ఖనిజాలు అత్యధికంగా చైనాలోనే లభిస్తున్నాయి. అమెరికా తయారు చేసే అత్యాధునిక మైక్రోప్రాసెసర్లను చైనాకు విక్రయించడంపై అమెరికా ఆంక్షలు విధించింది. దీనికి కౌంటర్ గా అన్నట్టు చిప్స్ తయారీ ఖనిజాల ఎగుమతులను చైనా ఆపేస్తోంది. మరికొన్ని రోజుల్లో అమెరికా ట్రెజరీ సెక్రటరీ జానెట్ యెల్లన్ చైనాలో పర్యటించనున్న నేపథ్యంలో ఆ దేశం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే జాతీయ భద్రత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు చైనా వాణిజ్యశాఖ చెబుతోంది. గాలియం జర్మేనియంను కమ్యూనికేషన్లు సెమీ కండెక్టర్లు సైనిక పరికరాల్లో అత్యధికంగా వినియోగిస్తారు. అలాగే సోలార్ ప్యానల్స్ తయారీలోనూ వీటిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం సెమీకండెక్టర్లను ఫోన్ల నుంచి వాహనాలు ఆయుధాలు ఇలా ప్రతి ఒక్క ఎలక్ట్రానిక్ పరికరంలో ఉపయోగిస్తున్న సంగతి తెలిసిందే. కొద్ది రోజుల క్రితం అమెరికా మిత్ర దేశమైన నెదర్లాండ్స్ కొన్ని రకాల ప్రత్యేకమైన చిప్ లను చైనాకు ఎగుమతి చేయడంపై నిషేధం విధించింది. దీంతో చైనా పరిశ్రమలు ఇబ్బందుల్లో పడ్డాయి. తాజాగా ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య పోరాటానికి ఇవే కేంద్రంగా నిలిచాయి. చైనాకు సెమీకండెక్టర్లను దక్కనివ్వకుండా అమెరికా ప్రయత్నిస్తోంది. అయితే ఆ చిప్ ల తయారీకి కావలసిన ముడి ఖనిజాలు అమెరికాలో లేవు. చిప్ ల తయారీకి కీలకమైన రాగి నిక్షేపాలు దక్షిణ అమెరికా ఖండ దేశమైన చిలీలో అత్యధికంగా ఉన్నాయి. వీటిని ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్న దేశం చైనానే కావడం గమనార్హం. అలాగే అల్యూమినియం టంగస్టన్ వంటి ఉత్పత్తులు చైనా ఆధిపత్యంలోనే ఉన్నాయి. ఇక బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం నిక్షేపాలు కూడా దక్షిణ అమెరికా ఖండ దేశాల్లోనే ఉన్నాయి. ఇక కంప్యూటర్లు స్మార్ట్ ఫోన్ మదర్ బోర్డుల తయారీలో వాడే గాలియం లోహ నిక్షేపాల్లో 95 శాతం చైనాలోనే ఉండటం గమనార్హం. ఇలా చిప్ ల తయారీలో వాడే అన్ని లోహాలపై చైనాకే పట్టు ఉంది. అమెరికా దీన్ని ఛేదించడానికి కొత్త వ్యూహాలతో ముందుకురానుండటం ఆసక్తికరంగా మారింది. భవిష్యత్తులో చిప్ ల కోసం యుద్ధం జరిగే అవకాశాలున్నాయి. వీటన్నింటిని అదుపు చేయగలవారే భవిష్యత్తును శాసించగలుగుతారని నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా చైనాల చిప్ వార్ కూడా అందుకేనంటున్నారు.

# ఆధార్ నవీకరణ తప్పనిసరి



కరీంనగర్ : ఆధార్‌కార్డు ఇప్పుడు తప్పనిసరి అయ్యింది.. రుణాలు పొందాలన్నా.. బ్యాంకు ఖాతా తీయాలన్నా.. ఆస్తిపరమైన లావాదేవీలకు.. జనన ధ్రువీకరణ పత్రానికి.. ఇలా ఏ అంశానికైనా అది లేనిది పనులు జరగడం లేదు. ఇంటి పేరు, చిరునామా వేర్వేరుగా ఉన్నా, తప్పులు దొర్లినా అది ఉపయోగపడటం లేదు. పదేళ్లకోసారి కార్డులో వివరాలను నవీకరించుకోవాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పటివరకు అప్‌డేట్ చేసుకోని వారు చేసుకోవాలని చెబుతోంది. ఈ మధ్య కాలంలో చేసుకుంటే నవీకరణ అవసరం లేదు. పట్టణ ప్రాంతాల్లో ఆధార్‌కార్డు నవీకరణకు ఈసేవా, ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. గ్రామాల్లో ప్రత్యేక శిబిరాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు.

పేరులో మార్పు : పేరులో సవరణ కోసం తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కలిగిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. పదోతరగతి మెమో, ఓటరు గుర్తింపుకార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉపాధిహామీ జాబ్‌కార్డు, సదరం ధ్రువీకరణ పత్రం తదితర వాటిల్లో ఏదైనా జత చేయాలి. ఉద్యోగులు గుర్తింపు కార్డు, తహసీల్దార్ ఇచ్చే కుల ధ్రువీకరణపత్రం సమర్పించవచ్చు.

పుట్టిన తేదీ: ప్రస్తుతం చిన్నారులకు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. కార్డులో ఒక్కసారి మాత్రమే పుట్టిన తేదీని మార్చుకునే వీలుంది. రెండోసారి కావాలంటే రాష్ట్ర రాజధానిలోని యూఐడీఏఐ కార్యాలయానికి వెళ్లి తగిన వివరణ ఇస్తూ ఆధారాలు, ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉంటుంది.

చిరునామా: ప్రతి పదేళ్లకు ఒకసారి కార్డులో చిరునామా, స్థానికతను నిర్ధారించుకుంటూ నవీకరణ చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి చిరునామా ధ్రువీకరణను జత చేయాలి. గతంలో గెజిటెడ్ అధికారుల సంతకంతో పేరు, తండ్రి పేరు, పుట్టినతేదీ, చిరునామా మార్పిడి చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం తహసీల్దార్, పురపాలక కమిషనర్ జారీ చేసిన గుర్తింపు పత్రం చూపాల్సిందే. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇచ్చే పత్రంతో విద్యార్థులు మాత్రమే మార్చుకోవచ్చు. ఇతరులకు పని చేయవు. ఓటరు గుర్తింపు పత్రం, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, పాసుపోర్టులో సరైన చిరునామా ఉంటే వాటితో సరి చేసుకోవచ్చు. కరెంట్ బిల్లు, టెలిఫోన్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ ధ్రువపత్రం వినియోగించుకోవచ్చు.

మూడు విభాగాలుగా దరఖాస్తులు..

గతంలో సవరణకు రెండు రకాలుగా దరఖాస్తు పత్రాలు ఉండేవి. ప్రస్తుతం వయసు ఆధారంగా మూడు విభాగాలుగా విభజించారు. ఒకటి అయిదేళ్లలోపు పిల్లలు, రెండోది 5-18 ఏళ్లు ఉన్న వారు. మూడోది ఆపై వయసు ఉన్న వారీగా విభాగాలుగా దరఖాస్తు ఫారాలు నిర్దేశించారు. నవీకరణలో ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు. 18 ఏళ్లు పైబడి కొత్తగా దరఖాస్తు చేస్తే సంబంధిత తహసీల్దార్‌తో ధ్రువీకరణ చేసుకోవాల్సి ఉంటుంది.

గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం

కరీంనగర్ జిల్లాలో మొత్తం ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు 29 కేంద్రాలు ఉన్నాయి. గ్రామాల్లో కూడా స్థానిక సర్పంచి, కార్యదర్శిని సంప్రదించి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తాం. ఒక రోజు ముందుగా సమాచారం అందిస్తారు.

శ్రీరాం శ్రీనివాస్‌రెడ్డి, ఈడీఎం

అధికంగా వసూలు చేస్తే చర్యలుపదేళ్లుగా ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారంత తప్పనిసరిగా నవీకరణ చేసుకోవాలి. కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. నిర్ణీత రుసుం కంటే అధికంగా వసూలు చేస్తే ఫిర్యాదు చేయాలి. అప్పుడు సంబంధిత నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. శ్యాంప్రసాద్‌లాల్, అదనపు పాలనాధికారి

# భగీరథ.. తప్పని వ్యధ



పెద్దపల్లి :మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటా తాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలోని 14 మండలాలు, 266 గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడో చోట నీరు లీకవ్వడం, నల్లాలు రాకపోవడం, కలుషితం కావడం, సక్రమంగా సరఫరా లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.జిల్లాలోని 438 ఆవాసాల్లో 321 నీటి ఉపరితల ట్యాంకులు నిర్మించారు. 2,038 కిలోమీటర్ల మేర పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. 1,48,286 కుళాయిల కనెక్షన్లకు 1,48,106 కనెక్షన్లు ఇచ్చారు. ఇంకా 180 కొత్త ఇళ్లకు ఇవ్వాల్సి ఉంది. ఇంటింటికీ తాగునీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. ప్రతి ఇంటికీ 400 లీటర్ల చొప్పున నీటి సరఫరా జరుగుతోంది. పెద్దపల్లి మండలంలోని తుర్కల మద్దికుంట, నిమ్మనపల్లిలో నీటిపైపులు పగిలిపోయాయి. బ్రాహ్మణపల్లి వద్ద గేట్‌వాల్వ్‌లు నీటి ఒత్తిడికి పగిలిపోయి తరచూ లీకేజీలకు గురవుతున్నాయి. రంగాపూర్‌లో నీటి సమస్యలున్నాయి. పాలకుర్తి మండలంలోని బామ్లానాయక్ తండాలో నీళ్లు రావడం లేదు. అంతర్గాంలోని మొఘల్‌పహాడ్‌లో భగీరథ పైప్‌లైన్ పెట్రోలియం డిపో ట్యాంకుకు లీకై పెట్రోల్ వాసన వస్తున్నట్లు అధికారులకు స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎల్లంపల్లి నుంచి 1.75 టీఎంసీల నీటిని అవసరాలను బట్టి ముర్మూరు నీటిశుద్ధికరణ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల వ్యాప్తంగా మొత్తం ప్రతి రోజూ 1.25 మిలియన్‌లీటర్ ఫర్ డే (ఎంఎల్‌డీ) అందిస్తున్నారు. భగీరథ పనులు అస్తవ్యస్తంగా చేపట్టిన గుత్తేదారులు బిల్లులు మంజూరైన వెంటనే పత్తాలేకుండా పోయారు. తరచూగా ఆయా గ్రామాల్లో తలెత్తే మరమ్మతులు, సరఫరా, లీకేజీలపై అటు పంచాయతీ పాలకవర్గానికి, ఇటు భగీరథ అధికారులకు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. తమ బాధ్యత కాదని ఇతరులపై నెట్టివేయడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలకు కావాల్సిన తాగునీటి సమస్యలను పరిష్కరించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

మార్చి9, 10 తేదీల్లో నీటి సరఫరా బంద్

ఇప్పటికే అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా జరుగుతుండగా మరోవైపు మార్చి 9, 10 తేదీల్లో జిల్లావ్యాప్తంగా బంద్ ఉంటుందని మిషన్ భగీరథ (గ్రిడ్) ఈఈ కె.పూర్ణచందర్ పేర్కొన్నారు. ముర్మూరు వద్ద ఉన్న 160 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రం వద్ద సబ్‌స్టేషన్ మరమ్మతులు, నిర్వహణపరమైన ఇబ్బందుల కారణంగా సరఫరా ఉండదని చెప్పారు. దీంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా, నీళ్లు రాకుండా పనులు చేపడితే తమకు తాగునీటి ఇక్కట్లు తప్పవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంపిణీ అస్తవ్యస్తంగా మారిందిఇదునూరి దేవరాజు, స్థానికుడు, తుర్కలమద్దికుంట

భగీరథ నీళ్లు సరిగా రావడం లేదు. తరచూ లీకవుతున్న పైప్‌లైన్లకు మరమ్మతులు చేయడం లేదు. లీకేజీలు నివారించేందుకు మేమే టేపులు అతికిస్తున్నాం. అధికారులకు చెప్పినా ఎలాంటి ఫలితం లేదు. రోజు ఇస్తున్నామని చెబుతున్నా అరకొరగా, అదికూడా సమయం సందర్భం లేకుండా సరఫరా చేస్తున్నారు.

పంచాయతీలదే మరమ్మతుల బాధ్యత

తుర్కల మద్దికుంటలోని ఎస్సీకాలనీ, ముదిరాజ్‌కాలనీ, ముస్లింకాలనీలో గేట్‌వాల్స్ అదనంగా ఏర్పాటు చేయడం, లీకేజీలను నివారించాల్సిన బాధ్యత పూర్తిగా గ్రామ పంచాయతీలదే. కొన్ని చోట్ల పంచాయతీ పాలకవర్గాలే సొంతంగా మరమ్మతు పనులు చేస్తున్నారు. భగీరథ సామగ్రి ధ్వంసమైతేనే గుత్తేదారులు బాధ్యత వహిస్తారు. అంతర్గాంలోని ఐవోసీ కాలనీలో పెట్రోల్ లీకైందని ఫిర్యాదు రాగానే వెంటనే వెళ్లాం. ప్రత్యేకంగా ఐవోసీ పెట్రోల్‌బంక్ వారి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యామ్నాయ పైప్‌లైన్ ద్వారా పంపిణీ చేస్తున్నాం.శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ (ఇంట్రా)

# ఎండుతున్న పొలాలు..

రుద్రంగి : ఎల్లంపల్లి నీళ్లు వస్తాయనే ఆశతో బావులు, బోరుబావుల్లో సరిపడా నీళ్లు లేనప్పటికీ వరి సాగు చేయడంతో పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడుతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఆశలతో సేద్యం చేసిన రైతు కళ్లల్లో పంటలను కాపాడుకోవడం ఎలా అనే నిస్సహాయత నెలకొంది. సాగైన పంటలకు నీళ్లందక పంటలు ఎండిపోయి పెట్టిన పెట్టుబడులు కూడా రావనే గుబులు అన్నదాతల్లో నెలకొంది. చందుర్తి, రుద్రంగి మండలాల్లో యాసంగిలో వరి పంట సాగు చేసిన రైతులు పడుతున్న ఇబ్బందులపై ప్రత్యేక కథనం.చందుర్తి మండలంలోని నర్సింగాపూర్, ఆశిరెడ్డి పల్లె, తిమ్మాపూర్ గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో నీటి కొరత ఏర్పడింది. వారం, పది రోజులయ్యే నాటికి సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రుద్రంగి మండల కేంద్రంలో దాదాపు 200 ఎకరాలకు పైగా పంటలకు మరో వారం పది రోజుల్లో నీరందకపోతే ఎండిపోతాయోనని రైతుల్లో దిగులు పట్టుకుంది. చెరువులు, కుంటలు దగ్గర్లో ఉన్న రైతులు పంటలను రక్షించుకోవటానికి 400 నుంచి 900 మీటర్ల దూరం నుంచి



పైప్‌లైన్లను ఏర్పాటు చేసుకుని అరిగోస పడుతున్నారు. ఫిబ్రవరి చివరి వరకు బావుల్లో ఊరిన భూగర్భ జల మట్టం పడిపోవటంతో బోరుబావులు కూడా సరిపడా నీటిని అందించలేకపోతున్నాయి.

వారం రోజులు ఎత్తిపోస్తేనే...

చందుర్తి మండలంలోని నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లె, తిమ్మాపూర్ గ్రామాల వ్యవసాయ భూముల నుంచి వెళ్లే ఎల్లంపల్లి కాలువలో నీటిని విడుదల చేస్తే కాలువ పరిసర ప్రాంత రైతులు మోటార్లను ఏర్పాటు చేసుకుని కొందరు, మరికొందరు నీటిని పంటలకు మళ్లించి కాపాడుకునే ప్రయత్నాలు చేస్తుంటారు. అలాగే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇటీవల మార్చి 1న ధర్మారం మండలం నందిమేడారం పంపుహౌజ్ నుంచి ఎత్తిపోతలు ప్రారంభమై అంతలోనే గేట్‌వాల్వ్ పగిలిపోయి పంపుహౌజ్‌లోకి నీరు చేరింది. దీంతో పంపుహౌజ్‌లో మోటార్లకు మరమ్మతులు చేసే పనులు కొనసాగుతున్నాయి. మరమ్మతులు పూర్తై అక్కడి నుంచి గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి చేరిన అనంతరం అక్కడి నుంచి కొడిమ్యాల మండలంలోని కొండాపూర్ రిజర్వాయర్‌లోకి, అక్కడి నుంచి ఫాజుల్‌నగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా చందుర్తి మండల కేంద్రం వరకు గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లి నీళ్లు చేరుతాయి. ఇదంతా జరగాలంటే మోటార్లు మొరాయించకుండా కనీసం వారం నుంచి పది రోజుల పాటు నిరంతరం నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది.

పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టక..

చందుర్తి మండలం లింగంపేట శివారులో రెండేళ్ల క్రితం ఎల్లంపల్లి పైప్‌లైన్ ధ్వంసమైంది. అప్పటి నుంచి మరమ్మతులు చేయకుండా వదిలేశారు. గుత్తేదారుకు నోటీసులు ఇచ్చామంటూ అధికారులు చెబుతున్నారే గానీ మరమ్మతులకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

వెంటనే విడుదల చేయాలి

ఎల్లంపల్లి నీరు వస్తుందనే ఆశతో బావుల్లో తక్కువ నీరున్నా ఐదు ఎకరాల్లో వరి పంట వేశాను. చేతికొచ్చే దశలో బావుల్లో నీరు అడుగంటడంతో కళ్ల ముందే రెండెకరాలు పంట ఎండిపోతోంది. ఎల్లంపల్లి నీళ్లు రాకపోతే మరింత నష్టం చవిచూడాల్సి వస్తుందని బాధగా ఉంది. వెంటనే ఎల్లంపల్లి నీళ్లను విడుదల చేసి ఆదుకోవాలి.కొలకాని నరేశ్, రైతు, నర్సింగాపూర్

20 గుంటలు ఎండిపోయింది

కాలువలోకి నీరు తప్పనిసరిగా విడుదల చేస్తారనే నమ్మకంతో మూడు ఎకరాల్లో వరి సాగు చేయగా 20 గుంటల వరకు పొలం ఇప్పటికే ఎండిపోయింది. మా వ్యవసాయ భూమి కాలువకు దూరంగా ఉంది. కాలువ నీళ్లు వస్తే పక్కనున్న రైతుల పొలాల నుంచి మా పొలంలోకి నీరు వచ్చే అవకాశం ఉంది.బొల్లు గంగరాజు, రైతు, ఆశిరెడ్డిపల్లె

బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో...

ప్రస్తుతం నందిమేడారం వద్ద పంపుహౌజ్‌లో మోటార్లకు మరమ్మతులు చేస్తున్నారు. మరమ్మతులు పూర్తి కాగానే చందుర్తి వరకు నీళ్లు వచ్చేలా చర్యలు చేపడతాం. లింగంపేట నుంచి రుద్రంగి వైపు ఉన్న పైప్‌లైన్ మరమ్మతులు చేయాలని గుత్తేదారుకు అనేకసార్లు నోటీసులు ఇచ్చాం. గుత్తేదారుకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పైప్‌లైన్ పనులు చేయటం లేదు.సంతు ప్రకాశ్, ఈఈ, ఎల్లంపల్లి ప్రాజెక్ట్

# తగ్గుతున్న లబ్ధిదారుల సంఖ్య

జగిత్యాల : రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం లబ్ధిదారుల సంఖ్య కిస్తికిస్తికీ తగ్గుతోంది. ఇటీవలే కేంద్రప్రభుత్వం 13వ కిస్తీ నిధులను రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల చేసింది. అయితే పథకంలో కొత్తరైతుల మాట అటుంచి పథకంలోని చాలామంది రైతులు డబ్బులు జమగాక ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2018 ఫిబ్రవరి 1న పీఎం కిసాన్ పథకాన్ని ప్రారంభించగా ఏటా మూడు దఫాలుగా రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6 వేలను రైతులకు ఇస్తున్నారు. ఏప్రిల్-జులై, ఆగస్టు-నవంబరు, డిసెంబరు-మార్చి విడతలుగా నిధుల బదిలీ చేపడుతుండగా పథకం ప్రారంభించినప్పట్నుంచి ఇప్పటివరకు 13 దఫాలుగా నిధులను ఇచ్చారు. అయితే గత సీజన్లలో నిధులు పొందిన చాలామంది రైతులు ఈకేవైసీని పూర్తిచేసినా కూడా ఈ సారి నిధులు రాలేదు. నిధులు పంపినట్లు ప్రధానమంత్రి పేరిట సెల్‌ఫోన్లకు సంక్షిప్త సందేశాలు వచ్చినా బ్యాంకు ఖాతాలకు మాత్రం నిధులు చేరలేదని రైతులు వాపోతున్నారు. మరికొందరికి తమకే చెందిన ఇతర ఖతాల్లో నిధులు జమకాగా ఇంకొందరికి వారి కుటుంబీకుల పేరిటగల బ్యాంకు ఖాతాల్లోకి నిధుల చేరాయి.

లి ఈకేవైసీని పూర్తిచేయనివారికి, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేనివారికి నిధులందలేదు. రేషన్ కార్డుల ఆధారితంగా కుటుంబంలో ఒకరినే పరిగణనలోకి తీసుకోవటం, ఆదాయపు పన్నును చెల్లిస్తున్నవారిని క్రమంగా పథకంలో నుంచి తొలగిస్తున్నారు. అయితే తాము దినుసుల డబ్బులను తీసుకునే బ్యాంకు ఖాతాల నిమిత్తం పాన్ కార్డులను తీసుకున్నా, ఇంటినిర్మాణ రుణానికి ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినా తమకు నిధులను నిలిపివేశారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థల నిర్వాహకులు, రాజ్యాంగ అధిపతులు, చట్టసభల ప్రతినిధులు, మున్సిపల్, కార్పొరేషన్, జడ్పీల అధ్యక్షులు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, నెలకు రూ.10 వేలకన్నా అధికంగా పెన్షన్ తీసుకునే పింఛన్‌దారులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, చార్టెడ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్ట్స్ తదితరులను కూడా క్రమంగా ఆన్‌లైన్ అనుసంధాన చర్యల ద్వారా గుర్తిస్తూ పథకంలోనుంచి తొలగిస్తుండటంతో లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. పథకం తొలికిస్తీలో జిల్లాలో 1.39 లక్షల మందికిపైగా రైతులకు నిధులందగా ప్రస్తుతం లబ్ధిదారుల సంఖ్య 81 వేలకు తగ్గింది. మరోవైపు పథకం ప్రారంభంలో రాష్ట్రప్రభుత్వం నుంచి జాబితాను తీసుకున్నవారిలోనుంచే ఇప్పటివరకు తొలగింపుల ప్రక్రియ చేపడుతుండగా నూతన రైతులకు పథకంలో చేరికకు అవకాశం కల్పించటంలేదు.

## బలం చాటేందుకు బలంతో..

నిజామాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. తెలంగాణలో పాగా వేసేందుకు కాంగ్రెస్ గట్టి కసరత్తే చేస్తోంది. ఇదే క్రమంలో 16న హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాలు, 17న బహిరంగ సభ నిర్వహణకు సిద్ధమైంది. టికెట్ వస్తుందనే ధీమా ఉన్నవారు సభకు బలగంతో వెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

పోటాపోటీగా..: కొన్ని నియోజకవర్గాల నుంచి సీటు ఆశించే వారు ఒకరి కంటే ఎక్కువ మంది ఉన్నారు. అధిష్ఠానం దృష్టిలో పడేందుకు ఈ సభను తమకు అనుకూలంగా మలుచుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. అదీగాక.. కొత్తగా కాంగ్రెస్‌లోకి వచ్చిన వారు.. సీటుపై భరోసా ఉన్నా.. పార్టీ మండల, గ్రామ స్థాయి నాయకులను కలుపుకొని పోవాల్సిన పరిస్థితి. ఇలాంటి సందర్భంలో వారందరిని తరలించేందుకు సౌకర్యాలు సమకూర్చటం ద్వారా క్యాడర్‌కు దగ్గరయ్యే అవకాశం చిక్కిందని భావిస్తున్నారు. ఇప్పటికే మండల కేంద్రాలు, పెద్ద పంచాయతీల నుంచి వచ్చే నాయకులను సంప్రదించి.వాహనాలు,



భోజన సదుపాయాలపై మాట్లాడారు.

పర్యవేక్షకుల దిశానిర్దేశం..: నియోజకర్గానికి ఇంతమంది తరలింపు అంటూ పార్టీ పెద్దలు లక్ష్యాన్ని నిర్దేశించారు. పోటీలో ఉన్న ఆశావహులందరూ ఇందులో భాగస్వాములు కావాలని పర్యవేక్షకులుగా ఉన్నవారు సూచిస్తున్నారు. సభ విజయవంతం తర్వాత టికెట్ విషయాలు ఆలోచిద్దామని నచ్చజెబుతున్నారు. నాయకుల మధ్య బేధాభిప్రాయాలున్న చోట ఎవరికి వారుగా తరలివెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

ఎక్కడి నుంచి ఎలా..: కామారెడ్డిలో షబ్బీర్ అలీ నేతృత్వంలో వందల సంఖ్యలో వాహనాలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఎల్లారెడ్డిలో ఇద్దరు నేతలు తమ అనుచరగణంతో వెళ్లేందుకు వేర్వేరుగా ఏర్పాట్లు చేసుకున్నారు. జుక్కల్‌లో ముగ్గురు ఆశావహులు, బాన్సువాడలో మరో ఇద్దరు ఆశావహులు ఎవరికి వారుగా సిద్ధమవుతున్నారు. నిజామాబాద్ రూరల్ నుంచి ముగ్గురిలో ఒకరు పెద్ద సంఖ్యలో వాహనాలు అద్దెకు మాట్లాడి పెట్టారు. నిజామాబాద్ అర్బన్ నుంచి పార్టీ పదవులున్న నాయకులు వాహనాలు మాట్లాడుకోగా.. టికెట్ ఆశిస్తున్న మరో నాయకుడు వేరేగా తన అనుచరులతో ఏర్పాట్లు చేసుకున్నారు. ఆర్మూర్‌లో ఇటీవల చేరిన ఓ నేత పార్టీ క్యాడర్‌తో పాటు యువతను తరలించి బలం చాటుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. బాల్కొండలో ఇరువురు నాయకులు వేర్వేరుగా ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. బోధన్‌లో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలనున్నారు.

## ఆరోగ్యశాఖ.. నియామకాలు లేక

మంచిర్యాల : జిల్లాలోని ఏ ఆరోగ్య కేంద్రంలో చూసినా సిబ్బంది కొరత తీవ్ర ఇబ్బంది పెడుతోంది. వైద్యుల నుంచి కింది స్థాయి ఉద్యోగుల వరకు సరిపడా లేక బాధితులతోపాటు కేంద్రం సిబ్బంది సైతం అవస్థలు పడుతున్నారు. వైద్యారోగ్యశాఖలోని మూడు విభాగాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. డీఎంఈ పరిధిలోని వైద్యకళాశాల తరగతులు ప్రారంభించి ఏడాది పూర్తయింది. ఇక్కడ ఉండాల్సిన సిబ్బందిలో 30 శాతం కూడా అందుబాటులో లేరు. టీవీవీపీకి సంబంధించి బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన ఏరియా ఆసుపత్రి ప్రారంభించి తొమ్మిది నెలలు దాటింది. ఇంకా సంబంధిత నియామక ఉత్తర్వులు రాలేదు. ఇక డీహెచ్ పరిస్థితి మరీ అధ్వానం. ఏళ్లు గడుస్తున్నా పలు పీహెచ్‌సీలు అరువు తెచ్చుకున్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు.

ఇది శాశ్వత సిబ్బంది లెక్క..ప్రభుత్వ నిబంధనలు, జీఓ ప్రకారం వైద్యకళాశాల (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)లో 32 విభాగాలకు సంబంధించి 1001 మంది ఉండాలి.ప్రస్తుతం ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నవారు 285 మందిటీవీవీపీ పరిధిలోని మూడు ఆసుపత్రులు (బెల్లంపల్లి, చెన్నూరు, లక్సెటిపేట)కాగా బెల్లంపల్లిలోని వంద పడకల ఆసుపత్రిలో నిబంధనల ప్రకారం 33 విభాగాల్లో 119 మంది అందుబాటులో ఉండాలి.

ఇక్కడ ప్రస్తుతం పని చేస్తోంది కేవలం 30 మంది



లక్సెటిపేట, చెన్నూరు ఆసుపత్రులు డీహెచ్ నుంచి టీవీవీపీకి బదిలీ అయినా సిబ్బంది నియామకమే లేదు.

వైద్యారోగ్యశాఖ(డీహెచ్) పరిధిలో జిల్లావ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాలు, సంబంధిత కార్యాలయాల్లో 563 మంది అందుబాటులో ఉండాలి.

ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో ప్రతీ చోట సిబ్బంది కొరత వెక్కిరిస్తుండగా కేవలం 311 మంది ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్నారు.

నూతనంగా మంజూరైన ఈ నస్పూర్ యూపీహెచ్‌సీకి సంబంధించి తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేపట్టారు. ఈ భవనం అందుబాటులోకి రాకపోవడం, దీనికి కేటాయించిన గ్రామపంచాయతీ భవనం మరమ్మతుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ఇక్కడి సిబ్బందిని కొరత ఉన్న కేంద్రాలకు సర్దుబాటు చేశారే తప్ప ఈ కేంద్రం సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యత్నించడం లేదు.ఇది బెల్లంపల్లిలో మంత్రి హరీష్‌రావు ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చిన వంద పడకల ఆసుపత్రి. కనీసం సీహెచ్‌సీ స్థాయి సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం భవనాలు కట్టడం, స్థాయిని ఉన్నతీకరించడం తప్పితే నియామకాల ఊసే ఎత్తడం లేదు.

జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల ఇది. 150 మంది విద్యార్థులతో మొదలు కావాల్సి ఉండగా ఇక్కడి వసతులు, సౌకర్యాల దృష్ట్యా వంద మందికే అనుమతి వచ్చింది. మంజూరు చేసి రెండున్నర ఏళ్లు దాటినాసొంత భవనం లేదు. అనుబంధ ఆసుపత్రి భవన నిర్మాణం ఇంకా ప్రారంభించలేదు. ఇది డీహెచ్ పరిధిలోని నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. అందుబాటులోకి వచ్చి దాదాపు ఏడేళ్లు దాటింది. ఇప్పటికీ ఇక్కడ శాశ్వత ఉద్యోగులు లేరు. వైద్యుల నుంచి స్టాఫ్‌నర్సు, ఎల్‌టీ, ఫార్మసిస్టు ఇలా కిందిస్థాయి సిబ్బంది వరకు అందరూ ఇతర చోట్ల పనిచేసే వారిని తాత్కాలికంగా నియామకం చేసి సేవలు అందిస్తున్నారు.

# సర్వేత్రా చిక్కులు



నల్గొండ: ఉమ్మడి జిల్లాలో కొంత మంది సర్వేయర్ల తీరు వివాదాస్పదమవుతోంది. తాము చెప్పినా శాఖ జిల్లా ఉన్నతాధికారి స్పందించడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ భూములను సమగ్ర సర్వే చేసి హద్దులు చూపాలని కోరుతూ రుసుం కట్టి ఏడాది గడుస్తున్నా కొన్ని ప్రాంతాల్లో సర్వేయర్లు రాక బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని ఏకంగా ఎమ్మెల్యేలే చెబుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. కొన్ని చోట్ల రెవెన్యూ అధికారులు, సర్వేయర్లకు సమన్వయం లేకపోవడంతో విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. చిట్యాల పురపాలిక పరిధిలోని సర్వే సంఖ్య 651లో 80.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా...ఇందులో ఎక్కువ భాగం గుట్ట ఉంది. ఈ గుట్టకు ఆనుకొని పట్టా భూములున్నాయి. ప్రభుత్వ భూమిలో కొంత మంది పేదలకు గతంలో సర్కారు ఇళ్ల నిర్మాణానికి అనుమతులివ్వగా...మిగతా భూమి ఎంతుంది, ప్రభుత్వ భూమి ఉన్న పరిధి మేరకు సమగ్ర సర్వే నిర్వహించి, హద్దులు నిర్ణయించాల్సి ఉంది. ప్రభుత్వ భూమిలో కొంత భాగం అన్యాక్రాంతమయిందని గుర్తించిన రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టడానికే పరిమితమయ్యారు. సమగ్ర సర్వే చేయడానికి ముందుకు రావడం లేదు. సమీపంలోని భూ యజమానుల ఒత్తిడి మేరకే సర్వే అధికారులు ప్రభుత్వ భూమి సర్వే చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి పక్కన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా భూములు వివాదాస్పదగానే ఉన్నాయి. వీటిని పరిష్కరించాలని చెబుతున్నా సంబంధిత అధికారుల నుంచి స్పందన ఉండటం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

**ఎకరానికి రూ.10 వేలు ముడుపులు!**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 72 మండలాలు ఉండగా...మండలానికొక సర్వేయరుతో పాటు డివిజన్ స్థాయి సర్వేయర్ పోస్టులున్నాయి. ప్రస్తుతం 14 మండలాల పోస్టులు, మూడు డివిజన్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 3 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. కొందరు ప్రభుత్వ సర్వేయర్లు బినామీలుగా ప్రైవేటు వారిని పెట్టుకుంటూ అడ్డగోలుగా డబ్బులు సంపాదిస్తున్నారు. నల్గొండతో పాటు సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడల్లో భూమి సర్వే చేయాలంటే హీనపక్షం రూ.10 వేలు ముట్టజెప్పాల్సి వస్తుందంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారికంగా 14 పోస్టులే ఖాళీగా ఉన్నా ఇప్పటికీ చాలా మండలాల్లో సర్వేయర్లు విధులకు సరిగ్గా హాజరుకావడం లేదని సంబంధిత వర్గాలే వెల్లడించాయి. ప్రైవేటుగా పనులు చేసుకుంటూ నిత్యం రూ.వేలల్లో సంపాదిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వివాదాస్పద భూములు ఎక్కువగా ఉన్న కృష్ణపట్టి ప్రాంతాలైన దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సర్వేయర్లకు ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకొని సర్వే పేరుతో ప్రభుత్వ భూములను సైతం కొంత మంది ప్రజాప్రతినిధులకు ధారాదత్తం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ శాఖపై ఉన్నతాధికారులు పెద్దగా శ్రద్ధ పెట్టకపోవడం, క్షేత్రస్థాయిలో సర్వేయర్లకు కొరత ఉండటంతో ఈ ప్రాంతంలోని కొంత మంది ప్రభుత్వ సర్వేయర్లు ఆడిందే ఆటగా నడుస్తోందన్న వాదనలున్నాయి. చాలా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సర్వే చేయాలంటే ప్రైవేటు సర్వేయర్లే దిక్కవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీరికి ప్రభుత్వ సర్వేయర్లే నెలకు వేతనాలు ఇచ్చి క్షేత్రస్థాయిలో పని కానిస్తున్నారు. ఇప్పటికైనా దరఖాస్తు చేసుకున్న వారికి తొందరగా సర్వే చేయడంతో పాటు ప్రైవేటు సర్వేయర్ల బెడద అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. సర్వేలో జాప్యం, ప్రభుత్వ భూములను సకాలంలో సర్వే చేయకపోవడంపై ప్రజాప్రతినిధి ఆగ్రహం చెందిన అంశాలపై వివరణకు నల్గొండ సర్వే అసిస్టెంటు డైరెక్టరు శ్రీనివాస్‌ను చరవాణిలో సంప్రదించగా ఆయన స్పందించలేదు. చిట్యాల పురపాలిక పరిధిలో 8 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, సమగ్ర సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలో టీపన్ దస్త్రాలను అన్నింటినీ మాయం చేశారు. జిల్లా అధికారులు పట్టించుకో కుంటే ఏకంగా సీఎంకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

నల్గొండలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో సర్వే అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నకిరేకల్ ఎమ్మెల్యే లింగయ్య చేసిన వ్యాఖ్యలివి.దేవరకొండ మండలం కొండభీమనపల్లికి చెందిన ఓ రైతు సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నారు. సమగ్ర సర్వే చేసి రైతుకు హద్దులు చూపాలని అదనపు కలెక్టరు సైతం సర్వే ఉన్నతాధికారిని ఆదేశించారు. అయినా స్థానిక డివిజన్ స్థాయి సర్వేయర్ స్థానిక అధికార పార్టీ నాయకుడితో కుమ్మక్కై తనకు హద్దులు చూపించడం లేదని రైతు ఆరోపిస్తున్నారు. ఏళ్లుగా అక్కడే పాతుకుపోయిన సదరు అధికారి తనకు నచ్చిన వారికి మాత్రమే సర్వే చేయిస్తున్నారనే వాదనలున్నాయి.పక్కన ఉన్న రెవెన్యూ స్థలాన్ని సర్వే చేయాలని ఏడాది నుంచి పట్టణానికి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి కోరుతు న్నా....సర్వే వద్దంటూ సంబంధిత శాఖ ముఖ్య అధికారి ఒకరు అడ్డుకు ఒటున్నట్లు తెలిసింది. ఆ స్థలాన్ని ఎవరూ సర్వే చేయొద్దని, చేస్తే తీవ్ర పరిణామాలుంటాయని మౌఖికంగా హెచ్చరించినట్లు సమాచారం.

## సత్వర వైద్యసేవలు పొందేందుకు మార్గం



కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా డిజిటల్ హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించింది. ఇప్పటి వరకు ఉన్న ఆరోగ్యశ్రీ కార్డుల స్థానంలో కొత్తగా వీటిని మంజూరు చేయనున్నారు. ఈ కార్డులతో ఆసుపత్రుల్లో త్వరగా రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయం కలగనుంది. తద్వారా వైద్య సేవలు త్వరగా పొందే అవకాశం ఏర్పడనుంది. డిజిటల్ కార్డు జారీ ప్రక్రియలో ఆరోగ్య మిత్ర, కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) సేవలను వినియోగిస్తున్నారు. ఆహార భద్రత కార్డులో ఉన్న ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డుకు లింక్ చేసిన చరవాణి నంబరు, ఇతర వివరాలను ఆ కేంద్రాల్లో అందజేస్తే వారు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఆ తర్వాత కార్డు జారీ అవుతుంది.

**రూ.5 లక్షల వరకు..**ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రూ.5 లక్షలు, ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.2 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయి. గతంలో తెల్లరేషన్ కార్డులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. తెలంగాణ ఏర్పడ్డాక ఆహారభద్రత కార్డులు జారీ చేయగా.. వాటి లబ్ధిదారులు ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు. ఇప్పుడు పాత కార్డులన్నింటి స్థానంలో డిజిటల్ కార్డులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**ఎక్కువ మందికి ఆసక్తి**

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ పథకాల ద్వారా 1672 రకాల వైద్యసేవలు అందిస్తుండటంతో ఎక్కువ మంది వీటిని ఎంచుకుంటున్నారు. పాత కార్డులు కొన్ని చోట్ల పనిచేయక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 6,55,908 పాత కార్డుల స్థానంలో డిజిటల్ కార్డులు జారీ చేయనున్నారు. కామారెడ్డి జిల్లాలో 2,53,458, నిజామాబాద్ జిల్లాలో 4,02,450 కార్డులు ఉన్నాయి.

**ఉపయోగం ఇలా..**

కొత్తగా జారీ చేస్తున్న డిజిటల్ హెల్త్ కార్డులతో ఆసుపత్రుల్లో చికిత్స కోసం వెళ్లినప్పుడు రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తవుతుంది. ప్రస్తుతమున్న కార్డులో కుటుంబ సభ్యుల వివరాలన్నీ ఉంటున్నాయి. ఈ డిజిటల్ కార్డు మాత్రం అందరికీ వేర్వేరుగా జారీ చేస్తారు. తద్వారా వివరాల నమోదు సులువవుతుంది. ఈ కార్డుపై బార్ కోడ్, క్యూఆర్ కోడ్ ఉండడంతో స్వైప్ చేయగానే వివరాలు వెల్లడై త్వరగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసి చికిత్స ప్రారంభిస్తారు.

**అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నాం అల్లాఉద్దీన్, కలెక్టరేట్ మిత్ర**

ప్రజలకు ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులపై పల్లెల్లో అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నాం. కార్డు ఉపయోగాలను వైద్యాధికారులతో వివరించే యోచన చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ వీటి కోసం నమోదు చేసుకోవాలని కోరుతున్నాం.

**నమోదు చేసుకోవాలి– అరుణ్ గౌడ్, సీఎస్‌సీ మేనేజర్, కామారెడ్డి**

ఆరోగ్యశ్రీ డిజిటల్ హెల్త్ కార్డులు ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి. ఆహారభద్రత కార్డుతో పాటు ఆధార్‌కు లింక్ చేసిన చరవాణి నంబరు, ఇతర వివరాలు సమీప కామన్ సర్వీస్ కేంద్రం (సీఎస్‌సీ)లో ఇస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత కార్డు జారీ అవుతుంది. తద్వారా సేవలు పొందడం సులువవుతుంది.

## పల్లెలకు స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలు

నిజామాబాద్ : పరిసరాల పరిశుభ్రత, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ సాధించిన పల్లెలకు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పురస్కారాలు అందించనున్నారు. ఇప్పటికే నందిపేట మండలంలోని ఆంధ్రనగర్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికై అవార్డు పొందింది. జిల్లాస్థాయిలో మూడు విభాగాల్లో 15 పంచాయతీలను ఉత్తమ పురస్కారాలకు ఎంపిక చేశారు.పరిగణనలోకి ఈ అంశాలు..పంచాయతీలో వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల వినియోగం, ఇంకుడు గుంతలు, చెత్త సేకరణ, డంపింగ్ యార్డులు, మురుగు కాల్వల ప్రగతి అంశాలను ఉత్తమ పంచాయతీ అవార్డు ఎంపికకు పరిశీలించారు. ఈ ఏడాది ఏప్రిల్ చివరి వరకు వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలో 530 పంచాయతీలు ఉన్నాయి. జనాభా ఆధారంగా 2 వేల కంటే తక్కువ, 2 నుంచి 5 వేలలోపు, 5 వేలకు పైన ఉన్నవి... ఇలా మూడు విభాగాల్లో ఐదు చొప్పున మొత్తం 15 పంచాయతీలను ఖరారు చేశారు. అవార్డుల ప్రదానోత్సవం త్వరలోనే నిర్వహించనున్నారు. జిల్లా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేతుల మీదుగా అందించేందుకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.జాతీయ స్థాయి అవార్డు ఎవరికో..కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 పురస్కారం కింద జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీలకు అవార్డు ఇవ్వనుంది. జిల్లా స్థాయిలో ఎంపికైన 15 పంచాయతీల వివరాలు రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్తాయి. ఇలా రాష్ట్రం మొత్తం మీద వచ్చిన వాటిని కేంద్రం పరిశీలిస్తోంది. జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైన వాటికి అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా పురస్కారాలు అందజేస్తుంది. మూడు కేటగిరిలో 15 పంచాయతీలు ఉండగా..ఉత్కంఠ నెలకొంది.

## ఆటల మైదానం.. మాటలకే పరిమితం

మంచిర్యాల : మంచిర్యాల జిల్లా ఏర్పడక ముందు నుంచి ఇక్కడ స్టేడియం కావాలన్నది స్థానిక క్రీడాభిమానుల కల. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు ఎందరో వీరికి సరైన వేదిక లేనప్పటికీ.. ఉన్న వనరులను ఉపయోగించుకుని సాధన చేస్తున్నారు. విద్యార్థులు ఆటల్లో రాణించి ఉన్నత స్థాయిలో నిలవాలని ఈ ప్రాంతానికి గుర్తింపు తీసుకురావాలని క్రీడల సంబరాల్లో ప్రజాప్రతినిధులు చెప్పే సూక్తులు ఉత్తమాటలే అవుతున్నాయి. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు మారినా ఆటల మైదానం కార్యరూపం దాల్చలేదు.

**నిధులున్నా.. నిర్మాణం కరవు**

మంచిర్యాలలో క్రీడాకారులకు కొదవ లేదు. ముఖ్యంగా కోల్‌బెల్ట్ ప్రాంతం కావడంతో కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ వంటి ప్రధాన క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న వారిలో జిల్లా క్రీడాకారులే ఎక్కువ మంది ఉంటారు. 1997లో లక్షెట్టిపేటకు మంజూరైన స్పోర్ట్స్ స్కూల్‌ను అప్పుడు కేంద్రమంత్రిగా ఉన్న వేణుగోపాలాచారి ఆదిలాబాద్‌కు తరలించారు. 1998లో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రూ.35 లక్షలతో ప్రారంభమైన స్టేడియం నిర్మాణం పునాదుల దశకు చేరుకోగానే అప్పటి గుత్తేదారు పనులను మధ్యలో వదిలేశారు. తర్వాత 2005లో స్థానిక రాంచెరువులో స్టేడియం నిర్మాణానికి రూ.1.70 కోట్లు మంజూరుకాగా అప్పటి మున్సిపల్ కౌన్సిల్ అభ్యంతరం తెలపడంతో పనులు మొదలు కాలేదు. 2009లో ఎమ్మెల్యేగా గెలిచిన అరవిందరెడ్డి స్టేడియం నిర్మాణానికి భూదాన్ ట్రస్టు స్థలాన్ని ప్రతిపాదించారు. ఈ స్థలంపై పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా అది కనుమరుగైపోయింది. 2015లో మంచిర్యాలలో స్టేడియం నిర్మాణానికి రూ.2.70 కోట్లు మంజూరయ్యాయి. మంచిర్యాలలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వెనక మైదానాన్ని స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దీంతో పనులు ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే ఇక్కడ నిర్మాణం చేపట్టవద్దంటూ పలు విద్యార్థి, ప్రజా సంఘాలు ఆందోళన చేయడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉంది.

**నెరవేరని కల..**

మంచిర్యాలతో మంజూరైన ఆసిఫాబాద్, కౌటాల, చెన్నూరులలో ఇప్పటికే మినీ స్టేడియాల నిర్మాణాలు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. 20–25 సంవత్సరాలుగా స్టేడియం నిర్మాణానికి పాలకులతోపాటు అధికారులు ఎందుకు శ్రద్ధ వహించడం లేదో.. క్రీడాకారులకు అంతు చిక్కడం లేదు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానాలు పట్టణవాసుల ఉదయం, సాయంత్రం నడక, వ్యాయామంతో కిక్కిరిసిపోతున్నాయి. ఇక క్రీడాకారులు ఆటలు ఆడుకోవడానికి స్థలమే లేకుండా పోయింది.

**క్రీడాకారులకు తీరని అన్యాయం పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి**

మంచిర్యాలలో స్టేడియం నిర్మాణానికి ఇరవై ఐదు సంవత్సరాలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. నిధులు మంజూరవుతున్నా స్థలం ఎంపికలో నిర్లక్ష్యం జరుగుతోంది. నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌తోపాటు ఇటీవల చెన్నూరులోనూ స్టేడియం పూర్తయింది. సింగరేణి నిధులతో సింగరేణేతర ప్రాంతాల్లో స్టేడియాల నిర్మాణాలతో స్థానిక క్రీడాకారులకు తీరని అన్యాయం జరుగుతోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

శ్రీకాంత్‌రెడ్డి, డీవైఎస్‌వో మంచిర్యాల

మంచిర్యాలలో స్టేడియం నిర్మాణం ప్రారంభించిన జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉంది. వేరే ప్రాంతాల్లో స్థల సేకరణను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్టేడియం లేకపోవడంతో పలు క్రీడల నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు.

## నిరుపయోగం.. సేవలకు అంతరాయం

సిర్పూరు : విద్యుత్తు కోతల సమయంలో కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్ల కిందట తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలకు విద్యుత్తు జనరేటర్లను పంపిణీ చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారు ఆయా కార్యాలయాలకు జనరేటర్లను అప్పగించి చేతులు దులిపేసుకున్నారు. అధికార యంత్రాంగం సైతం వీటిని వినియోగంలోకి తీసుకురావడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అవి నిరుపయోగంగా మారాయి. కొన్నిచోట్ల యంత్రాలకు తుప్పుపట్టగా.. చాలా ప్రాంతాల్లో వాటి భాగాలు దెబ్బతిన్నాయి. మరికొన్నిచోట్ల అసలు యంత్రాలే కనిపించకుండా పోవడం గమనార్హం. దీంతో రూ.లక్షల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరులా మారింది. మిగతా ప్రాంతాలతో పోల్చితే జిల్లాలో జనరేటర్ల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే జిల్లాలో తరచూ విద్యుత్తు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వర్షం పడితే చాలు గంటల తరబడి కరెంటు పోతోంది. ఈ సమయంలో ఆన్‌లైన్ సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాల్లో దాదాపుగా నిలిచిపోతున్నాయి. **తడుస్తూ.. ఎండుతూ..**

కౌటాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కొన్నేళ్ల కింద ఏర్పాటు చేసిన జనరేటర్ నిరుపయోగంగా ఉంది. ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఉపయోగించిన దాఖలాలు లేవు. కనీసం దీనికి షెడ్డు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పెట్టినచోటే తుప్పు పట్టే పరిస్థితి ఏర్పడుతోంది. విద్యుత్తు కోతలు విధించిన సమయంలో కార్యాలయంలో రిజిస్ట్రేషన్, అత్యవసర పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**అంతటా అలంకారప్రాయంగా..**బెజ్జూరు మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో జనరేటర్లు అలంకారప్రాయంగా మారాయి. విద్యుత్తు కోతల సమయంలో కార్యాలయంలో పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని సిబ్బంది వాపోతున్నారు. దహెగాం తహసీల్దార్ కార్యాలయంలో యంత్రం మూలకు చేరింది. దీంతో విద్యుత్తు లేని సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇన్వర్టర్లు ఏర్పాటు చేసినా.. పని ఒత్తిడికి అవి ఎక్కువసేపు నిలవడం లేదు. సిర్పూరు మండలంలోనూ ఇదే పరిస్థితి ఉంది.

**గంటల తరబడి నిరీక్షణ..**

నిరంతరం రద్దీగా ఉండే కాగజ్‌నగర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలోనూ జనరేటర్ నిరుపయోగంగా ఉంది. కీలకమైన మండలం కావడంతో నిత్యం ప్రజలు ఏదో ఒక పనికి కార్యాలయానికి వస్తుంటారు. ఇక్కడ విద్యుత్తు సేవల్లో అంతరాయం ఏర్పడితే అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**సిబ్బందికి తప్పని ఇబ్బందులు..**

అత్యవసర సమయాల్లో విద్యుత్తు కోతలతో అంతర్జాల సేవలు అందడం లేదు. దూరదృశ్య సమీక్షల సమయంలో అధికారులు, సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. జనరేటర్ నడిచేందుకు డీజిల్, పర్యవేక్షించేందుకు ఆపరేటర్, మరమ్మతులకు గురైనప్పుడు మెకానిక్‌లతో బాగు చేయించేందుకు డబ్బుల అవసరం ఉంటుంది. జనరేటర్ల నిర్వహణ కోసం ప్రభుత్వం ఆయా శాఖలకు ఎలాంటి నిధులు కేటాయించడం లేదు. అధికారులు సొంతంగా ఖర్చులు చేసి బాగుచేసినా డబ్బులు వస్తాయో? రావో తెలియని పరిస్థితి ఉండటంతో వాటిని పట్టించుకోవడం లేదని తెలిసింది.

**ఇన్వర్టర్ల సాయంతో సేవలందిస్తున్నాం**

విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడితే సేవల్లో అంతరాయం ఏర్పడకుండా ఇన్వర్టర్ బ్యాటరీలను ఏర్పాటు చేశాం. వీటితో కార్యాలయంలో నాలుగు గంటల పాటు నిరంతరాయంగా పనులు కొనసాగుతున్నాయి. అప్రకటిత విద్యుత్తు కోతలు ఉంటే ఏం చేయలేని పరిస్థితి. జనరేటర్ల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.కిరణ్‌కుమార్, తహసీల్దార్, కౌటాల

## పరిశోధనలు పెంచేలా 'ప్రయాస్'

భూపాలపల్లి: సామాజిక పరిశోధనలను ప్రోత్సహించేందుకు.. పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయాస్–2023 పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తోంది. విద్యార్థి దశలోనే శాస్త్రీయ విజ్ఞానంపై మక్కువ పెంచుకొని సృజనాత్మకత పెంపొందించేందుకు ఇది చక్కటి వేదిక.. ఉత్తమ ప్రదర్శనలకు ప్రోత్సాహకాలు సైతం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20వ తేదీలోగా ఔత్సాహికులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించింది.

అర్హులు వీరే..పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 14 నుంచి 18 ఏళ్ల లోపు వయసు ఉండాలి. ప్రస్తుతం 9వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అన్ని యాజమాన్య పాఠశాలలకు చెందిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఒకరు లేదా ఇద్దరు, గ్రూపుగా ఏర్పడి పరిశోధన కొనసాగించవచ్చు. విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ,




గణితం, జీవశాస్త్రం బోధించే పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు గైడ్‌గా వ్యవహరించవచ్చు. విద్యార్థులకు తమ ఆలోచనలు అందించవచ్చు. విద్యార్థులు తమ పరిసర ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కారానికి శాస్త్రీయ పరిశోధన చేయాలి. తమ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల సాయం తీసుకుని ఆలోచనలు పంచుకోవచ్చు. ఎంపికైన ప్రతిపాదనలకు రూ.50 వేల ప్రోత్సాహం అందించనున్నారు.

అధిక సంఖ్యలో పాల్గొనాలి..– రాంకుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, భూపాలపల్లిజిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. దీని కోసం ఇప్పటికే టీశాట్ ఛానల్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాం. విద్యార్థులు తమ ప్రతిభ నిరూపించేందుకు ఇది చక్కటి ఉన్న విద్యార్థులు పాల్గొని సృజనాత్మకత పెంపొందించుకోవాలి.

## రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు ఏవీ..?

భూపాలపల్లి: ఆదాయం మెండుగా ఉన్న గార్ల రైల్వే స్టేషన్‌లో వసతి సౌకర్యాలు కరవయ్యాయి.. అభివృద్ధి పనులను అధికారులు విస్మరించడంతో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. స్టేషన్ ప్రగతికి చర్యలు చేపట్టాలని రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, మండల ప్రజలు కోరుతున్నారు. గార్లలో కృష్ణా, గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతున్నాయి. గత నెల 18 నుంచి మణుగూరు సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైలుకు కూడా హాల్టింగ్ ఇచ్చారు.

రైల్వే స్టేషన్ పరిసరాలను కూడా అభివృద్ధి కమిటీ సభ్యుల విజ్ఞాపనల మేరకు శుభ్రం చేయించారు. ఆధునిక సాంకేతికతను అందించి, వసతి సౌకర్యాలను మెరుగుపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.




ప్రయాణికుల సౌకర్యార్థం శాతవాహన, ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని, పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాల దృష్ట్యా రద్దు చేసిన ప్యాసింజరు రైళ్లను పునరుద్ధరించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.సమస్యలివి..:ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రైలు ఆగుతున్న దృష్ట్యా రిజర్వేషన్, జనరల్ బోగీలను సూచిస్తూ డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలి. దీంతోపాటు రైళ్ల వివరాలు మైకులో తెలపాలి.

రైల్వే స్టేషన్‌లో ఎగువ, దిగువ ప్లాట్‌ఫామ్‌లను మరింత పొడిగించాల్సి ఉంది. దిగువ రైల్వేలైను స్టేషన్ వద్ద క్రాసింగ్ ఎక్కువగా ఉండటంతో కొన్ని సందర్భాల్లో ప్రయాణికులు రైలు దిగుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.రైల్వే స్టేషన్‌లో తాగునీటి సౌకర్యం కల్పించాలి. మరుగుదొడ్లు, ప్రయాణికుల నిరీక్షణ గది ఏర్పాటు చేయాలి

రైల్వే స్టేషన్ వద్ద సిగ్నల్ వ్యవస్థ, విద్యుత్తు దీపాలను పూర్తిస్థాయిలో నిర్వహించాలి.

## అసంపూర్తి పనులు.. తప్పని తిప్పలు

మెట్‌పల్లి : పట్టణంలో జాతీయ రహదారికి ఇరువైపులా పెద్ద మురుగుకాల్వ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.7 కోట్లతో పనులు చేపట్టారు. పనులు సగం కూడా పూర్తికాకముందే నిలిపివేశారు. ఎస్సారెస్పీ కెనాల్ నుంచి పట్టణ శివారులోని శ్రీమహాలక్ష్మి వట్టి వాగు వరకు రహదారికిరువైపులా మురుగు కాల్వ నిర్మాణం చేపట్టారు. అక్కడక్కడా కాల్వ నిర్మించి వదిలేశారు. మురుగు ఎటూ వెళ్లక నెలల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసతో పాటు దోమలు పెరుగుతున్నాయి.ప్రమాదకరంగా ఇనుపచు



వ్వలుమురుగుకాల్వ పనులు అసంపూర్తిగా వదిలేయడంలో ఇనుపచువ్వలు ప్రమాదకరంగా మారాయి. కాల్వలు పెద్దగా ఉండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షం నీటితో పాటు మురుగు రహదారిపైకి చేరి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షం పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ప్రజారోగ్య ఈఈ సంపత్‌రావును వివరణ కోరగా గతంలో పనులు చేసిన గుత్తేదారు మధ్యలోనే వదిలేసి వెళ్లాడని, మరో గుత్తేదారులో పనులు చేపట్టేందుకు నిర్ణయించామన్నారు. త్వరలోనే పనులు పూర్తిచేయిస్తామని తెలిపారు.

# రూ.అర కోటికి పైగా అద్దె బకాయి



భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లతో పాటు క్వార్టర్స్ ద్వారా వచ్చే అద్దెలు సక్రమంగా రావడం లేదు. నెలకు రూ.2.5 లక్షలు రావాల్సి ఉండగా రూ.2 లక్షలు రావడమే గగనమైంది. గిరిజనులను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లేందుకు దశాబ్దాల కిందట జిల్లాలో వేర్వేరు చోట్ల రూ.కోట్లు వెచ్చించి దుకాణ సముదాయాలను నిర్మించారు. వీటిని గిరిజనులకు కేటాయించారు. కిరాణ, కంప్యూటర్ కేంద్రాలు, టైలరింగ్, ప్రైవేటు కార్యాలయాలతో పలు రకాలుగా వీటిని లబ్ధిదారులు ఉపయోగించుకుంటున్నారు. దీని కోసం ప్రతీ నెలా ఐటీడీఏకు అద్దె చెల్లించాల్సి ఉండగా కొందరు మొండికేస్తున్నారు. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొనగా మొత్తం బకాయిలు రూ.అరకోటికి పైగానే పేరుకుపోయాయి. భద్రాచలం మార్కెట్‌లో 21, విస్తా కాంప్లెక్స్‌లో 13, పాల్వంచలో 40, మణుగూరులో 8, ఇల్లందులో 10 దుకాణాలు ఉన్నాయి. వీటిపై నెలకు రూ.1.5 లక్షల అద్దె రావాల్సి ఉంది. ఆశించిన రాబడి లేకపోవడంతో మరమ్మతులు చేయడం మానేశారు. ఇదే క్రమంలో లబ్ధిదారుల్లో కొందరు తమకు కేటాయించిన దుకాణాలను బినామీలకు అప్పగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అసంపూర్తిగా క్వార్టర్లు

ఐటీడీఏలో విధులు నిర్వహించే అధికారులకు సిబ్బందికి కలిపి 98 క్వార్టర్లు ఉన్నాయి. వీటిపై నెలకు రూ.లక్ష వరకు అద్దె రావాల్సి ఉండగా ఇందులో ఐదారుగురు అద్దె చెల్లించకుండా ముఖం చాటేస్తున్నారు. నోటీసులు ఇస్తున్నప్పటికీ బదులివ్వడం మానేశారు. ఇతర చోట్ల పనిచేస్తున్న కొందరు ఉద్యోగులకు సైతం ఇక్కడ క్వార్టర్స్‌ను కేటాయించారు. కానీ స్థానికంగా పనిచేసే పది మందికి మాత్రం క్వార్టర్స్‌ను ఇవ్వకుండా వెయిటింగ్ జాబితాలో ఉంచడం విశేషం. సొంత సిబ్బందిని పక్కన పెట్టి వేరే ఉద్యోగులకు నివాసం కల్పించడంపై ఆరోపణలు వస్తున్నాయి. 20 మందికి సరిపడా ఇళ్లను నిర్మించేందుకు ఐదేళ్ల కిందట పనులు చేసిన ఇంజినీరింగ్ విభాగం ఆ తర్వాత నిధులు చాలడం లేదని వాటిని మధ్యలోనే ఆపారు. పనులు పూర్తి చేస్తే పని చేసే చోటే సిబ్బంది ఉండేందుకు అవకాశం ఏర్పడుతుంది.

# విద్యార్థుల ఆకలి తీరనుంది!



భూపాలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధికంగా పేద కుటుంబాల విద్యార్థులే చదువుతుంటారు. ఉదయాన్నే ఖాళీ కడుపులతో వచ్చే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. దీంతో పాఠాలపై శ్రద్ధ పెట్టలేక నీరసిస్తున్న విషయాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం దసరా కానుకగా.. విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రకటించింది. బడి పిల్లలందరికీ ఉదయం అల్పాహారం అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడంతో వచ్చే అక్టోబరు 24 నుంచి 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం(సీఎం బ్రేక్‌పాస్ట్ స్కీం)' ప్రారంభించేందుకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ రెండు రోజుల క్రితం జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. ఇంత వరకు దేశంలో తొలిసారిగా తమిళనాడు సర్కారు ఆ రాష్ట్రంలో ప్రారంభించగా ఈ పథకాన్ని అమలు చేయనున్న రెండో రాష్ట్రం తెలంగాణ మాత్రమే..

పోషకాలతో కూడిన అల్పాహారం

ప్రభుత్వ బడుల్లో అల్పాహారంగా అందించాల్సిన పదార్థాలపై పాఠశాల విద్యాశాఖ ప్రణాళిక ఇవ్వాలని ఆ శాఖ కార్యదర్శి కరుణ అధికారులను ఆదేశించారు. త్వరగా, సులభంగా వండేలా ఉండాలని, పోషకాలు ఎక్కువగా ఉండేలా చూడాలని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి. పొంగలి, కిచిడీ, సేమియా, ఉప్మా, రవ్వ లేదా గోధుమ ఉప్మాలాంటివి అందించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

35 శాతం ఖాళీ కడుపులతో..

వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు జిల్లాల పరిధిలో ప్రాథమిక 2360, ప్రాథమికోన్నత 401, ఉన్నత పాఠశాలలు 567 వరకు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు దాదాపుగా 35 శాతం విద్యార్థులు ఉదయం పూట ఎలాంటి ఆహారం తీసుకోకుండా పాఠశాలలకు హాజరవుతున్నట్లు అంచనా.. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారు ఎక్కువగా ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. ఉదయాన్నే సమయం మించిపోతుందని త్వరగా బయల్దేరి రావడం, కుటుంబ సభ్యులు వ్యవసాయం, కూలీ, ఇతరత్రా పనులకు వెళ్లిన సందర్భాల్లో విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడాల్సి వస్తోంది. దీంతో విద్యాభ్యాసం ఆశించిన మేరకు అందడం లేదు. కొన్ని సందర్భాల్లో నీరసిస్తున్నారు. చదువుపై ఏకాగ్రత దెబ్బతింటోంది. ఉదయం ఖాళీ కడుపుతో రావడంతో పౌష్టికాహారం లోపం ఏర్పడుతోంది. దీంతో కొందరు బాలికలు రక్తహీనత బారిన పడుతున్నారని పలు అధ్యయనాల్లో బహిర్గతమైంది. ఈ తరుణంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమలైతే చక్కటి ఫలితాలు రానున్నాయని పలువురు విద్యావేత్తలు భావిస్తున్నారు.

రాగి జావ పంపిణీ

ప్రభుత్వం పిల్లలకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో రాగి జావ పంపిణీ చేస్తోంది. శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సహకారంతో దీన్ని అమలు చేస్తున్నారు. వారంలో మూడు రోజుల పాటు రాగి జావ అందిస్తున్నారు. కార్యక్రమం ప్రారంభించిన సమయంలో కొందరు విద్యార్థులు జావ తాగడానికి ఇష్టపడలేదు. క్రమంగా చాలా మంది రాగి జావ తాగడానికి ముందుకు వస్తున్నారని పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు చెబుతున్నారు. అదేవిధంగా వారానికి మూడు రోజుల పాటు రోజు విడిచి రోజు ఉడకబెట్టిన కోడిగుడ్లు మధ్యాహ్న భోజనం ద్వారా కిచిడీ, వెజిటేబుల్ బిర్యాని ఇతర కూరగాయలతో అందిస్తున్నారు.విద్యార్థులకు మేలు జరుగుతుంది..అల్పాహార పథకం అమలైతే అనేక మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది. ఉదయాన్నే టిఫిన్ అందిస్తే తరగతులు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతాయి. పౌష్టికాహారం అందిస్తే, ఆరోగ్యంగా ఉంటారు. ప్రభుత్వం నుంచి సంబంధిత మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పథకాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటాం.రాంకుమార్, డీఈవో, భూపాలపల్లి

# కేఎంసీలో కొరవడిన పర్యవేక్షణ

భూపాలపల్లి: కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ)లో రాత్రి వేళ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో విద్యార్థులు గాడి తప్పుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి 11 గంటల తర్వాత కూడా కళాశాల ఆవరణలో విద్యార్థులు కార్లలో బృందాలుగా వచ్చి జన్మదిన వేడుకలు చేసుకోవడం, బయటి నుంచి ఆహారం తెప్పించుకోవడం వంటివి చేస్తున్నారు. వారు ఏం చేస్తున్నారో కూడా పర్యవేక్షించే పరిస్థితి లేదు. ఈ క్రమంలోనే జూనియర్లు, సీనియర్ల మధ్య గొడవలు జరుగుతున్నాయి. కళాశాల ఆవరణలో బాలికలు, బాలురకు వేర్వేరు చోట్ల వసతి గృహాలు ఉన్నాయి. మొదటి నుంచి నాలుగో సంవత్సరం వరకు సుమారు వెయ్యి మంది వరకు విద్యార్థులు వసతిగృహాల్లో ఉంటున్నారు. సీనియర్లు, జూనియర్లకు సంబంధించిన గదులు వరుసగా ఉండటంతో ఒకరికొకరు ఎదురు పడినప్పటి సీనియర్లు ర్యాగింగ్ పేరిట వేధించడం పరిపాటిగా మారింది. ఈ నెల 14న అర్ధరాత్రి కూడా సీనియర్లు కొందరు ఓ విద్యార్థి పుట్టిన రోజు వేడుక చేసుకున్నారు.

నీళ్లు తీసుకురాలేదని దాడి..రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మొదటి సంవత్సరం విద్యార్థి ఈ నెల 14న అర్ధరాత్రి గ్రంథాలయం నుంచి తన గదికి వెళ్తుండగా.. ఓ సీనియర్ అతడిని తాగడానికి నీళ్లు తేవాలని పురమాయించడంతో మాట వినలేదని, పుట్టిన రోజు వేడుక చేసుకుంటున్న మిగతా సీనియర్ల దృష్టికి తీసుకెళ్లి కలిసి దాడికి పాల్పడడం చూస్తుంటే వారిపై కళాశాల అధికారుల అజమాయిషీ ఏమాత్రం లేదని తెలుస్తోంది. మరుసటి రోజు బాధిత విద్యార్థి తల్లిదండ్రుల సాయంతో ప్రిన్సిపల్, మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినా విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. సీనియర్ల దాడిలో గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందిన బాధిత విద్యార్థి 15న ఉదయం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసులు విచారణ చేపట్టారు. ఏడుగురు సీనియర్లు అతడిపై ర్యాగింగ్‌కు పాల్పడ్డారని పోలీసులు నిర్ధారిస్తున్నారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ డా.మోహన్‌దాసు మాట్లాడుతూ.. జూనియర్‌పై




సీనియర్ల దాడిపై విచారణ చేస్తున్నామని, ఈ నెల 19న ర్యాగింగ్ కమిటీ సమావేశంలో చర్చించాక చర్యలు తీసుకునే అవకాశం ఉందని చెప్పారు.

ఆందోళన కలిగిస్తున్న వరుస ఘటనలు

ఈ ఏడాది ఫిబ్రవరి 22న అనస్థీషియా మొదటి సంవత్సరం విద్యార్థిని డా.ప్రీతి వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికీ అలాంటి ఘటనలు జరుగుతున్నా బయటకు రావడంలేదు. గతంలోనూ 2021 నవంబర్ 13న రాత్రి సీనియర్లు, జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేశారని, మద్యం మత్తులో దాడిచేశారని ఓ విద్యార్థి ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, రాష్ట్ర మంత్రి కేటీఆర్, డీజీపీ, వైద్యారోగ్యశాఖ సంచాలకుడికి ఫిర్యాదు చేసిన ఘటన అప్పట్లోనూ సంచలనంగా మారింది. అంతకు ముందు కూడా ఓ కేంద్రమంత్రి కుటుంబానికి చెందిన విద్యార్థిని ర్యాగింగ్‌కు గురికాగా.. ఈ ఘటనలో 15 మందికిపైగా విద్యార్థులను కళాశాల నుంచి సస్పెండ్ చేశారు. అడపాదడపా ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్నా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

పలు సెక్షన్ల కింద కేసు నమోదు..తనపై ఏడుగురు సీనియర్లు దాడి చేసినట్లు బాధిత విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు మట్టెవాడ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. నిందితులపై ర్యాగింగ్ చట్టంతో పాటు 294/బి, 323, 240 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఆదివారం చెప్పారు.

# చుట్టూ మురుగు.. వ్యాధుల ముప్పు

కోరుట్ల: కోరుట్ల పట్టణ శివారులోని ఏసుకోనిగుట్టపై 2008లో అప్పటి ప్రభుత్వం ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేసి ఇళ్లులేని నిరుపేదలకు పట్టాలను మంజూరు చేసింది. ఇళ్ల నిర్మాణాలకు ఆర్థికసాయం అందించింది. దీంతో సుమారు 560 ఇళ్లను నిర్మించుకుని ఏళ్ల తరబడి ప్రజలు నివాసముంటున్నారు. కాలనీ పక్క నుంచి ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు నుంచి పట్టణంలోని కంచరకుంటను నింపేందుకు పంటకాలువ ఉంది. పంటకాలువలో చెరువు నీరు ప్రవహించడంతోపాటు కాలనీలో ఇళ్ల నుంచి వెలువడ్డ మురుగు, పైప్రాంతం నుంచి వచ్చే వరద ఒక్కచోట చేరి మురుగు కుంటలా తయారైంది. ఇక్కడి నుంచి పంటకాలువలో మురుగు నీరు కిందికి ప్రవహిస్తుంది. ఏడాదంతా కుంటలో మురుగు నిల్వ ఉండి అందులో చెత్తాచెదారం చేరి దోమలు, పందులకు నిలయంగా తయారైంది. దీంతోపాటు కాలనీ



నుంచి వెలువడే మురుగు మరోవైపు ఇళ్ల పక్కనే నిల్వ చేరి దుర్గంధం వ్యాపిస్తుంది. కాలనీకి మూడు వైపులా మురుగు నిల్వ ఉండటంతో వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నా బల్దియా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. పంట కాలువ నీరు, మురుగు వేరు వేరుగా ప్రవహించేలా ప్రత్యేక కాలువలను నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ఏసుకోనిగుట్టపైనున్న కాలనీల్లోని రోడ్లన్నీ కంకరతేలి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్‌రోడ్లుగా అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులతో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పల్లె మార్గం.. ప్రయాణ నరకం

కోరుట్ల: శ్రీరాంపూర్ మండలం మడిపల్లి కాలనీ నుంచి భీమారంపల్లికి వెళ్లే మట్టి రోడ్డు చిన్న వర్షానికే బురదగా మారుతుండటంతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి రహదారులే సూచికలు. కాగా కొన్నేళ్లుగా గ్రామీణ రహదారులు నిర్వహణ కరవై అధ్వానంగా మారాయి. వాహనాల సంఖ్య పెరగడంతో పల్లె మార్గాల్లో రద్దీ పెరిగింది. సామర్థ్యానికి మించి బరువుతో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రహదారులు ఛిద్రమవుతున్నాయి. ఇసుక లారీలతో పరిస్థితి అధ్వానంగా మారింది. పెద్దపల్లి నియోజకవర్గంలోని ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లో గ్రామీణ రహదారులు పూర్తిగా పాడయ్యాయి. మరమ్మతులపై గ్రామాభివృద్ధి కమిటీలు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలు పట్టించుకోకపోవడంతో చిన్న వర్షానికే బురదమయమవుతున్నాయి.

ఇసుక లారీలతో తారు ఛిద్రం

కనగర్తి నుంచి పొత్కపల్లి రోడ్డుకు ఇటీవల మరమ్మతు చేయడంతో గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగైంది. ఓదెల నుంచి కొలనూరుకు వెళ్లే ఆయకట్టు రోడ్డు వాన కురిస్తే బురదమయమవుతోంది. దీంతో ఆయా మార్గాల్లో వెళ్లాల్సిన వాహనాలు ఇతర గ్రామాల మీదుగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది.



కాల్వశ్రీరాంపూర్ మండలంలోనూ ఇసుక రవాణాతో తారు రోడ్లు ధ్వంసమయ్యాయి. శ్రీరాంపూర్ నుంచి కిష్టంపేట, సుల్తానాబాద్, గుంపుల మార్గాల్లో లారీల తాకిడికి రహదారులు దెబ్బతింటున్నాయి. వీటిలో కొత్తగా వేసిన కిష్టంపేట, శ్రీరాంపూర్ రోడ్డు కూడా అప్పుడే పగుళ్లు చూపుతోంది.జూలపల్లి మండల కేంద్రంలో రహదారుల నిర్వహణ సరిగ్గా లేక తారు రోడ్లు సైతం గుంతలమయమవుతున్నాయి. పోలీస్‌స్టేషన్ రోడ్డు వర్షం కురిస్తే బురదగా మారుతోంది.

మానేరు వాగు నుంచి ఇసుక రవాణాతో ఓదెల మండలం పొత్కపల్లి నుంచి గుంపులకు వెళ్లే 7 కిలోమీటర్ల రహదారి గుంతలమయమైంది. వర్షం కురిస్తే లారీలు మినహా ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి.

నిధులున్నా సాగని పనులు

అందుగుపల్లి నుంచి దేవునిపల్లి రోడ్డు

రహదారుల మరమ్మతు కోసం ఏటా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. మంజూరు ఉత్తర్వు ప్రతులు అందగానే ఆర్భాటంగా భూమిపూజలు చేసి వదిలేస్తున్నారు. పెద్దపల్లి మండలం దేవునిపల్లి చుట్టూ వలయ రహదారి కోసం పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది. మొదటి విడతగా అందుగులపల్లి నుంచి దేవునిపల్లి రోడ్డుకు నిధులు విడుదలైనా పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానికులను బురద కష్టాలు వదలడం లేదు. పొత్కపల్లి నుంచి గుంపుల వరకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు. దీంతో రెండు గ్రామాల మధ్య దూరం(తిరిగి రావాల్సి వస్తుండటంతో) పెరుగుతోంది. పెద్దపల్లి పట్టణం నుంచి పెద్దకల్వలకు వెళ్లే ఇప్పలదారిని అభివృద్ధి చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ నిధులు విడుదలైనా పనులు కొంత దూరం వరకే నిలిచిపోయాయి. ఇదే పరిస్థితి వివిధ గ్రామాల్లోనూ ఉంది.

వివిధ దశల్లో రహదారుల అభివృద్ధి పనులు– నర్సింహాచారి, ఆర్‌అండ్‌బీ ఈఈజిల్లాలో 20 రహదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వీటిలో కొన్నింటికి టెండరు ప్రక్రియ పూర్తి కాగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. గుంపుల–పొత్కపల్లి రోడ్డు పనులు త్వరలోనే మొదలవుతాయి.

# ఉచిత శిక్షణ.. ఉపాధికి రక్షణ

ఖమ్మం : ఆధునిక కాలంలో టైలరింగ్ వృత్తికి మంచి ఆదరణ లభిస్తోంది. రోజురోజుకు వివిధ రకాల దుస్తులు విపణిలోకి వస్తున్నాయి. దీంతో ఈ రంగంలో మహిళలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పలు సంస్థలు గ్రామాల్లో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నాయి. ఇదే రీతిన ముదిగొండలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ప్రజ్వల యువజన సంఘం, ఉషశ్రీ సోషల్ సర్వీస్ సొసైటీ సహకారంతో మహిళలు, యువతులకు ఉచిత కుట్టు శిక్షణ నిర్వహిస్తున్నారు.

మహిళలు, యువతుల ధీమా

కేంద్రంలో 30మందికి 45రోజుల పాటు ఎంబ్రాయిండరీ, గాగ్రాలు, పంజాబీ డ్రస్‌లు, ఫ్రాక్‌లు కుట్టడంపై మెలకువలు నేర్పిస్తున్నారు. కుట్టు అల్లికలు, ఎంబ్రాయిండరీతోపాటు బ్యూటీషియన్‌పైనా శిక్షణ ఇస్తున్నారు. తమ కాళ్ల మీద తాము నిలబడొచ్చనే ఆలోచనతో మహిళ



లు ఉత్సాహంగా వచ్చి శ్రద్ధగా ఉచిత శిక్షణ పొందుతున్నారు. అనంతరం వారికి సర్టిఫికేట్లు అందజేయనున్నారు. దీంతో భవిష్యత్తులో ఉపాధి పొందుతామని మహిళలు, యువతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకుంటున్నారు

చింతలచెరువు లక్ష్మి, ఉషశ్రీ సొసైటీ అధ్యక్షురాలు

మహిళలు ఆత్మవిశ్వాసంతో ఉండాలన్నా, జీవితంలో సమస్యలు వచ్చినప్పుడు ముందుకు వెళ్లాలన్నా ఆర్థికంగా ఎదుగుదల ఎంతో అవసరం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యం ఉంటేనే నెగ్గుకురాగలరు. వారు ఆర్థిక స్వావలంబన సాధించడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుంది. మా సొసైటీ ఆధ్వర్యంలో గతంలో మహిళల కోసం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశాం. మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకుంటున్నారు.

మంచి అవకాశాలున్నాయి

చావా త్రివేణి, శిక్షకురాలుటైలరింగ్ రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయి. ఎన్ని యంత్రాలు, మరెన్నో ఆకృతులు వచ్చినా చేతి కుట్టు పనికి డిమాండ్ తగ్గలేదు. రోజురోజుకు మారిపోయే వస్త్రాలను ఆకృతులకు అనుగుణంగా మహిళలు తమ దుస్తులు కుట్టించుకోవాలనే ఆకాంక్ష ఉంటుంది. పలు గ్రామాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చా. కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిండరీతోపాటు బోకేలు తయారీ, బ్యూటీషియన్ విభాగాల్లోనూ నేర్పిస్తాం.

# సైకిల్ షెడ్డు నిర్మిస్తే బాగు

ఖమ్మం : కార్పొరేటు పాఠశాలలకు దీటుగా సర్కారీ బడులను తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 'మన ఊరు, మన బడి/మన బస్తీ' పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. 12 రకాల మౌలిక వసతులతో మార్చినాటికి అన్ని విద్యాలయాల రూపురేఖలు మార్చునున్నట్లు అధికార యంత్రాంగం స్పష్టం చేసింది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. వసతుల్లో సైకిల్ షెడ్ల ఏర్పాటు లేకపోవటంపై విద్యార్థులు పెదవి విరుస్తున్నారు.సమీప గ్రామాల నుంచి వచ్చే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో చాలామంది సైకిల్‌పైనే రాకపోకలు సాగిస్తున్నారు. పట్టణ సమీప ప్రాంతాల వారిదీ ఇదే పరిస్థితి. సరైన రవాణా సౌకర్యాల్లేక పోవడం, ఆర్థిక సమస్యల కారణంగా సైకిళ్లపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఆయా పిల్లలు సైకిళ్లు నిలిపేందుకు



ప్రత్యేకంగా విద్యాలయాల్లో షెడ్లు లేవు. కొన్నిచోట్ల చెట్ల నీడన నిలుపుతున్నారు. మిగతా చోట్ల ఆవరణలో ఎండలోనే నిలుపుతుండటంతో టైర్లు పంక్చర్ అవుతున్నాయి. వర్షాకాలంలోనూ తడిసి మరమ్మతులకు గురవడం, తుప్పుపట్టడం జరుగుతోంది. 'మన ఊరు, మన బడి'లో షెడ్లు నిర్మించాలన్నది విద్యార్థులు, తల్లిదండ్రుల కోరిక. ఎస్ఎంసీ కమిటీలు నిర్మాణ ప్రతిపాదనలు చేసి పంపాలని కోరుతున్నారు. "సైకిల్ షెడ్ల సమస్యను కలెక్టర్లకు నివేదిస్తా. సీఎస్సార్ పాలసీలో అయినా అవసరమైన చోట ఏర్పాటు చేయాలని కోరుతాం. "సోమశేఖర్‌శర్మ, డీఈఓ

## పరిష్కార వేదిక.. అవాంతరాలు తొలగిక

మిర్యాలగూడ : ఇటీవల కాలంలో విద్యుత్తు సరఫరాలో అనేక అవాంతరాలతో పాటు పరిమితి, కారణం లేకుండా వేలాది రూపాయల్లో బిల్లులు వస్తున్నాయి. వీటిపై బాధితులు సంబంధిత కార్యాలయాల్లో సంప్రదిస్తే సరైన, ఒక్కోసారి సరైన సమాచారం ఇచ్చే వారే కరవవుతున్నారు. దీంతో వినియోగదారులు అనేక అవస్థలు పడుతూ లంచాలు ఇచ్చి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి విద్యుత్తు సంస్థ ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేసింది. వీటి పనితీరుపై వినియోగదారుల్లో సరైన అవగాహన లేకపోవడంతో ఏళ్ల తరబడి సమస్యల పరిష్కారానికి కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. పరిష్కరించే సమస్యలు ఇవీ...విద్యుత్తు సరఫరాలో తరచూ వచ్చే అంతరాలు..హెచ్చుతగ్గులు, మీటర్ల సమస్యలు, విద్యుత్తు బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసులు ఇవ్వడంలో జాప్యం, పేరు బదిలీ, విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ, నియంత్రికల మార్పిడి, బకాయిల చెల్లింపులు..వంటి సమస్యలపై విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయవచ్చు. తొలుత డివిజన్ కార్యాలయాల్లోని సీఎస్‌సీ కేంద్రాల్లో నిర్ణీత పద్ధతిలో దరఖాస్తు చేసుకుని..సమస్య పరిష్కారానికి నోచుకోకపోతే వేదికలో ఫిర్యాదు చేయవచ్చు.

# ఆయుష్మాన్‌భవ.. వసూలు తోవ



ఖమ్మం : పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజనను ప్రవేశపెట్టింది. ఈ పథకంపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన లేదు. పథకంలో వివరాల నమోదుకు తొలుత ఈకేవైసీ చేయించుకోవాలంటూ కొన్ని రోజులుగా పల్లెల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు దాన్ని ఎవరు మానిటరింగ్ చేస్తున్నారనేది తెలియదు. కొన్ని రోజులుగా జిల్లాలో ప్రైవేటు సంస్థల వ్యక్తులు గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటుచేసి నగదు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌లో చూపించే ఆయుష్మాన్‌భవ కార్డుల్లో తేడాలుండటంతో సామాన్యులు గందరగోళానికి గురవుతున్నారు.

తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి

కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌భవ కింద ఏడాదికి రూ.5లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తుంది. ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కసరత్తు మొదలైంది. తొలుత ఏఎన్ఎం, ఆశలకు ఇచ్చి పేదల వివరాలను ఆన్‌లైన్ చేయాలని అనుకున్నారు. పని ఒత్తిడితో వారు ఈ బాధ్యతలు చేపట్టడానికి విముఖత చూపటంతో ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. అదికూడా నత్తనడకన సాగుతుంది. ఇటీవల గ్రామాల్లో ఈకేవైసీ కసరత్తు ప్రారంభించారు. ఈ ప్రక్రియను చూస్తున్న సంస్థతోపాటు, కామన్ సర్వీసు కేంద్రం వాళ్లు దీన్ని చేస్తున్నారు. ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమైతే ఓటీపీతో, లేకుంటే లబ్ధిదారుని వేలిముద్రతో ఈకేవైసీ చేయాలి. దీన్ని ఉచితంగా చేయాలని ప్రభుత్వం సూచించినా క్షేత్ర స్థాయిలో రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. ఇటీవల కొణిజర్ల మండలం మల్లుపల్లి, రామనర్సయ్యనగర్‌లో రూ.50 వరకు వసూలు చేయగా, కొణిజర్ల, పల్లిపాడులో రూ.30 వరకు తీసుకున్నారు. జిల్లాలోని ఇతర మండలాల్లోనూ రూ.30 నుంచి రూ.50 వరకు తీసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే రూ.100 వరకు దండుకుంటున్నారు. ఇప్పటికే సామాన్యుల నుంచి ఇలా రూ.లక్షల్లో వసూలు చేశారు.

గందరగోళం

నమోదుపై క్షేత్ర స్థాయిలో స్పష్టత లేదు. వైద్యశాఖ పర్యవేక్షణ లేదు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడంతో ఎవరు ఏమి చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి. ముఖ్యంగా అసలు ఏజెన్సీ వాళ్లు ఎవరో, కామన్ సర్వీసు కేంద్ర వాళ్లు ఎవరో అర్థంకావటం లేదు. మరోవైపు ఆన్‌లైన్‌లో లబ్ధిదారుడి వివరాలు నమోదు చేశాక మొబైల్‌లో ఈకేవైసీ చేసినవారు ఒక రకమైన కార్డును చూపిస్తుంటే, మరొకరు వేరే కార్డును చూపిస్తున్నారు. లైవ్ ఫొటో తీయాల్సి ఉండగా గతంలో ఉన్న ఫొటోలను తీసుకుంటున్నారు. దీనివల్ల తప్పులు దొర్లి వైద్య సేవలు అవసరం ఉన్న సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే గందరగోళానికి తెరపడుతుంది.

'ఆయుష్మాన్ భవ పథకంలో ఈకేవైసీ ఉచితంగానే చేయాలి. ఆ పథకాన్ని ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. గతంలో ఏఎన్ఎంలు చేయాలని ప్రతిపాదన ఉండగా పని ఒత్తిడి ఉండటంతో అది వీలుపడలేదు. నగదు తీసుకునే విషయంపై ఆరా తీస్తాం.' డాక్టర్ రాంబాబు, డిప్యూటీ డీఎంహెచ్‌వో'ఆయుష్మాన్ భవలో భాగంగా గ్రామాల్లో అర్హులకు సంబంధించి ఈకేవైసీ చేస్తున్నాం. సిబ్బంది మెయింటనెన్స్ కోసం రూ.30 తీసుకుంటున్నాం. కొంతమంది గ్రామాల్లో ఇదే అదునుగా రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తూ ఈకేవైసీ చేస్తున్నారు. కార్డుల తీరుతెన్నులపై ఇంకా స్పష్టత లేదు.'రమేశ్, ప్రైవేటు సంస్థ జిల్లా సమన్వయకర్త.

# కొబ్బరి బోర్డు కొలువుదీరేదెన్నడో..



ఖమ్మం : కొబ్బరి బోర్డు కోసం ఉభయ జిల్లాల రైతులకు ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి దీర్ఘకాలిక పంట కొబ్బరిని సాగు చేస్తున్న రైతాంగానికి ప్రోత్సాహం అందించేందుకు అవసరమైన కొబ్బరి బోర్డు ఏర్పాటుపై ముందడుగు పడటం లేదు. అధిక పెట్టుబడులు పెట్టిన కర్షకులకు ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందకపోవడంతో పంట విస్తీర్ణం పెంచాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది.రాష్ట్రంలోనే అత్యధిక మొత్తంలో కొబ్బరి పంట ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,000 ఎకరాల్లో ఈ పంట విస్తీర్ణం ఉండగా ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే సుమారు 4500 ఎకరాల్లో పండిస్తున్నారు. రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, నాగర్‌కర్నూలు జిల్లాల్లోనూ తోటలు ఉన్నాయి. అశ్వారావుపేటలో 50 ఎకరాల విస్తీర్ణంలో కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా భద్రాద్రి జిల్లాలోనే అత్యధికంగా కొబ్బరి సాగవుతుండటం వల్ల ఇక్కడే బోర్డు కొలువుదీరాలని దీర్ఘకాలంగా రైతాంగం ఆశిస్తోంది.

సమస్యలేంటి?బోర్డు లేకపోవడం వల్ల రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. ప్రధానంగా మార్కెటింగ్ ఇబ్బందిగా మారింది. మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్ల ఇక్కడి రైతులు ఏపీ గానీ, హైదరాబాద్ దిగుబడి తీసుకెళ్లాల్సి వస్తుంది. కొబ్బరి అనుబంధ పరిశ్రమలూ లేవు. ప్రభుత్వం నుంచి అందాల్సిన రాయితీలు అందడం లేదు. తోటలు వేసుకున్నప్పుడు మొక్కకు రూ.40 ఇవ్వాలి. పైసా ఇవ్వటం లేదు. రైతులు దరఖాస్తులు చేసుకున్నా రాయితీలు చెల్లించని పరిస్థితి.

ప్రయోజనం ఇలా..దేశవ్యాప్తంగా కొబ్బరి రైతుల అవసరార్థం కొబ్బరి బోర్డు పనిచేస్తుంది. పంట అభివృద్ధి, పథకాల అమలు లక్ష్యంగా 1981, జనవరి 12న కొబ్బరి అభివృద్ధి మండలి ఏర్పాటు చేశారు. భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది పనిచేస్తుంది. కేరళలోని కొచ్చిలో సీడీబీ ప్రధాన కార్యాలయం ఉండగా బెంగళూరు, చెన్నై, గువహటి, పట్నాలో ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా విజయవాడ (ఏపీ), థానే (మహారాష్ట్ర), పిట్టపల్లి (ఒడిశా), పోర్ట్ బ్లెయిర్ (అండమాన్-నికోబార్ దీవులు), కోల్‌కత్తా (పశ్చిమ బెంగాల్) నగరాల్లో బోర్డు శాఖలు ఉన్నాయి. బోర్డు ఉంటే మార్కెటింగ్, పరిశ్రమల ఏర్పాటు సులభమవుతుంది. పాత తోటల తొలగింపు, పునరుద్ధరణ, సాంకేతిక సంస్థ, బీమా పథకాల అమలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందజేసేందుకు ఉపకరిస్తుంది.కొబ్బరి ఉత్పత్తుల విస్తరణ, క్షేత్రస్థాయి ప్రదర్శన, నైపుణ్య శిక్షణ మొదలగు అందించే అవకాశం ఉంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటును బోర్డు ప్రోత్సహిస్తుంది. ఫలితంగా తోటల విస్తీర్ణం పెంపు, రాయితీల బాధ్యతను అదే చూస్తుంది. ఇన్ని విధాలా సేవలందించే కొబ్బరి బోర్డు శాఖను రాష్ట్రానికి కేటాయించాలని ఈ ప్రాంత రైతులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. భద్రాద్రి జిల్లాలో దీన్ని స్థాపించాలన్న డిమాండ్ 15 ఏళ్లుగా బలంగా ఉన్నా ముందడుగు లేదు."భద్రాద్రి కొబ్బరి బోర్డు ఏర్పాటుకు అనువైన జిల్లా. ఇక్కడి రైతులు ఎదురుచూస్తున్నారు. ఇదే విషయంపై ఇటీవల కలెక్టర్ అనుదీప్, ఉద్యాన శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. త్వరలోనే తీపి కబురు అందుతుందని ఆశిస్తున్నాం."మరియన్న, ఉద్యాన శాఖ అధికారి, భద్రాద్రి జిల్లా"భద్రాద్రి జిల్లాలో కొబ్బరి బోర్డు ఏర్పాటు ఆవశ్యకత ఉంది. ఏళ్లుగా విన్నవిస్తున్నా ఏర్పాటు చేయటం లేదు. కొబ్బరి రైతులకు ఎలాంటి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు అధికారులు ఇక్కడ లేరు. ప్రభుత్వం చొరవ చూపాలి."ఆళ్లపాటి రామ్మోహన్‌రావు, కొబ్బరి ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు

# ఆర్సీవోల పర్యవేక్షణకు చెల్లు

ఖమ్మం : ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గిరిజన గురుకుల విద్యా వ్యవస్థలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఈ నెల 3న గురుకుల కార్యదర్శి జారీ చేయగా భద్రాచలం ఐటీడీఏలోని ఆర్సీవో కార్యాలయానికి చేరాయి. నూతన ఉత్తర్వుల ప్రకారం డిగ్రీ కళాశాలల పర్యవేక్షణ బాధ్యతలను ప్రాంతీయ సమన్వయ అధికారి (ఆర్సీవో) నుంచి తప్పించారు. ఇక నుంచి రాష్ట్ర స్థాయిలో గురుకులాల కార్యదర్శి పరిధిలో వీటి పర్యవేక్షణ ఉంటుంది. నిర్ణయం వెనుక కారణాలపై స్పష్టత లేనప్పటికీ పరిపాలనా సౌలభ్యం నిమిత్తం మార్పు చోటు చేసుకుందని భావిస్తున్నారు. ఈ ప్రభావం ఖమ్మం జిల్లాలో ఒకటి, భద్రాద్రి కొత్తగూడెంలో మూడు కళాశాలలపై పడనుంది. పినపాక నియోజకవర్గానికి మంజూరైన బాలుర డిగ్రీ కళాశాలకు మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇప్పటి వరకు భద్రాచలంలో నిర్వహించారు. ఇటీవలే దీన్ని అశ్వాపురం మండలం మొండికుంటకు తరలించారు. ఇందులో 350 మంది చదువుతున్నారు. ఖమ్మంలో 580 మంది బాలికలు, కొత్తగూడెంలో 600 మంది బాలికలు, దమ్మపేటలో 360 మంది బాలికలు అభ్యసిస్తున్నారు. దాదాపు అన్ని గ్రూపులను గురుకులాల్లో బోధిస్తుండగా బోధన, బోధనేతర సిబ్బంది రెగ్యులర్, తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్నారు. దమ్మపేట మినహా



మిగతా మూడుచోట్ల అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 కళాశాలలు ఉండగా ఇందులో బాలికలకు 15, బాలురకు 7 ఉన్నాయి. సుమారు 9 వేల సీట్లు ఉన్నట్లు అంచనా. కొన్నిచోట్ల భర్తీ కావడం లేదు. తాత్కాలిక ఉద్యోగాల నియామకాలతో పాటు పరిపాలనాపరమైన అంశాలపై ఆరోపణలు వస్తున్నాయి. తాజా మార్పులకు ఇదీ ఒక కారణంగా భావిస్తున్నారు. ఈ అంశంపై భద్రాచలం ఆర్సీవో దేవిడ్‌రాజ్‌తో మాట్లాడుతూ ఉత్తర్వులు అందాయని తెలిపారు.

# యువతరం.. వెలుగుల తోరణం

భూపాలపల్లి : రాష్ట్రానికి వెలుగులు అందించే కేటీపీపీలో యువతరం ఉరకలేస్తోంది.. సీనియర్లతో పోటీపడుతూ తమకు సాటిలేరని ముందుకు సాగుతున్నారు. మొత్తం 503 మంది పురుష ఇంజినీర్లు ఉండగా 30 ఏళ్లలోపు దాదాపు 200 మంది యువ ఇంజినీర్లు ఏఈలుగా పలు విభాగాల్లో విధుల్లో చేరారు. జెన్‌కో ఆధ్వర్యంలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండు దశల 1100 మెగావాట్ల బొగ్గు ఆధారిత విద్యుత్తు కేంద్రంలో 503 మంది పురుషులు, 296 మంది మహిళా ఇంజినీర్లు పలు ఉద్యోగాల్లో కొలువై ఉన్నారు. రాత్రీపగలు విధులు నిర్వహిస్తూ కేటీపీపీని రాష్ట్రంలోనే కీలకమైన ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుపుతున్నారు. అత్యంత క్లిష్టమైన బాయిలర్, టర్బైన్, సైలో, చిమ్ని పవర్ కంట్రోల్ బోర్డు తదితర సాంకేతిక పరికరాల వద్ద నిత్యం అప్రమత్తంగా ఉంటూ వెలుగుల కేంద్రంలో అలసటలేని విధులను నిర్వహిస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం మండలం చెల్పూరులో కేటీపీపీ 997 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో మొదటి 500 మెగావాట్ల విద్యుత్తు కేంద్రంతో పాటు 600 మెగావాట్ల కేంద్రం ఉంది. మొత్తం సామర్థ్యం 1100 మెగావాట్లు.. ఈ రోజు రాష్ట్రంలో కరెంటు కోతలు లేకుండా నిరంతర విద్యుత్తు సరఫరా అవుతుందంటే అందులో కేటీపీపీ థర్మల్ పవర్ ప్రాజెక్టు కీలకం.. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ యువతరం



ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

సివిల్ ఇంజినీరుగా విధులు..- మోతుకూరి రాజేందర్, సివిల్ ఏఈ

మాది జయశంకర్ జిల్లా రేగొండ మండలం పొనగండ్ల గ్రామం.. ఓ ప్రైవేటు పాఠశాలలో పది చదివి హనుమకొండలో ఇంటర్ పూర్తి చేశాను. హైదరాబాద్‌లో బీటెక్ పూర్తయింది. కేటీపీపీలోనే తొలి పోస్టింగ్. మొదటిసారిగా ఇక్కడ సివిల్ విధుల్లో చేరే ముందు భయపడ్డాను. అంతా సీనియర్ల కిందనే విధులు నిర్వహించాలి. దాన్ని ఛాలెంజ్‌గా తీసుకొన్నాను. ఇప్పుడు అందరితో కలిసి పనులు చేయిస్తున్నాను.

కీలకమైన బాయిలర్ వద్ద..- పెద్దిల్లి శేఖర్, ఎలక్ట్రికల్ ఏఈ

కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన యంత్రం బాయిలర్.. ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాను. సీనియర్ల సలహాలు తీసుకుంటూ చేస్తున్న ఈ ఉద్యోగం సవాల్‌తో కూడుకున్నది.. బాయిలర్ ట్యూబుల లీకేజీతో తరచూ సమస్య ఉంటుంది. అలాంటి చోట విధులు నిర్వహించాలి. మాది కరీంగనర్ జిల్లా చొప్పదండి గ్రామం. నాన్న వ్యవసాయ పనులు చేస్తూ చదివించారు.

నాన్న కలలను నిజం చేశాను - వరంగంటి మేఘనాథ్, సివిల్ ఏఈ

మా నాన్న విశ్రాంత కానిస్టేబుల్.. మాది వర్ధన్నపేట మండలం పెరుమాండ్లగూడెం గ్రామం. బీటెక్‌ను హనుమకొండ నిట్‌లో పూర్తి చేశాను. అన్నయ్య నవీన్‌కుమార్ జెన్‌కోలోనే సివిల్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించారు. నాన్న నన్ను కూడా ఆ దిశగా ప్రోత్సహించారు. ఆయన ఆశయం కోసం కేటీపీపీలో సివిల్ ఏఈగా ఉద్యోగం సాధించాను. నిరంతర విద్యుత్తు అందిస్తున్న ప్రాజెక్టులో నేను ఉన్నందుకు గర్వంగా ఉంది.

నాన్న ఆటో నడుపుతూ.. అమ్మ బీడీలు చుడుతూ..

- గెంట్యాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ

మాది వరంగల్. నాన్న ఆటో నడుపుతారు. అమ్మ బీడీలు చుడుతుంది. వారు ఎంతో కష్టపడి చదివించారు. నేను పదో తరగతిలో 528 మార్కులు సాధించాను. బీటెక్‌లో 85 శాతం మెరిట్ సాధించాను. మొదటి ఉద్యోగం ఇక్కడే.. సీహెచ్‌పీ(కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్) వద్ద విధులు నిర్వహిస్తాను. కేటీపీపీలో విధులు నిర్వహిస్తుండటంపై సంతోషంగా ఉంది.

## అన్నపూర్ణ పథకం.. ఆదరణ

భువనగిరి : పురపాలికల్లో ఆకలితో అలమటించే పేదలకు నిత్యం ఒక పూట భోజనం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం అత్యధిక పురపాలికల్లో అమలుకు నోచుకోవడం లేదు. కూలీ, ఇతర పనులతో పాటు వివిధ అవసరాల నిమిత్తం గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చే వారు, పేదలు, యాచకులకు ప్రయోజనం చేకూర్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రంలోని పలు పురపాలికల్లో అన్నపూర్ణ పథకాన్ని 2018లో ప్రారంభించింది. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని అత్యధిక పురపాలికల్లో ఈ పథకం అమల్లో లేకపోవడం గమనార్హం. సూర్యాపేట, భువనగిరిలో 2018 నుంచి, కోదాడలో 2019లో, నల్గొండలో 2022లో ఈ పథకాన్ని ప్రారంభించారు. భువనగిరిలో ఆగస్టు 2021 నుంచి ఈ పథకం మూసివేయడంతో ప్రయోజనం చేకూరడం లేదు.

అమలు తీరు ఇలా...ఉమ్మడి జిల్లా పరిధిలో 19 పురపాలికలు ఉన్నాయి. కేవలం నాలుగు పురపాలికల్లోనే ఈ పథకాన్ని ప్రారంభించారు. భువనగిరిలో పథకం ప్రారంభించినప్పుడు హరేరామ హరేకృష్ణ సంస్థ వారు నిత్యం 300 మందికి రూ.5కే భోజనం అందించారు. సంస్థ వడ్డించే ప్లేటు భోజనం ధర రూ.29.25 అయినా సంస్థ రూ.5కే రుచికరమైన భోజనం ప్రజలకు వడ్డించేది. ప్లేటు ధరలో మున్సిపాలిటీ రూ.24.25 సంస్థకు చెల్లించేది. పథకం ఆపేసి నాటికి మున్సిపాలిటీ సంస్థకు రూ.23,62,920 చెల్లించింది. కోదాడ పురపాలికలో నవంబరు 2019 నుంచి అన్నపూర్ణ పథకం అమల్లో ఉంది. ఇప్పటి వరకు 1,56,000 ప్లేట్ల భోజనం నిర్వాహకులు అందించారు. రూ.44.14 లక్షలు ఖర్చు చేశారు. నల్గొండలో ఆగస్టు 2022 నుంచి పథకం అమలులో ఉంది. రోజుకు 500 మందికి భోజనం అందిస్తున్నారు. సూర్యాపేటలో ఆగస్టు 2018 నుంచి రోజుకు 300 మందికి భోజనం అందిస్తుండగా రూ.2 కోట్లు ఖర్చు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని ప్రధాన పట్టణాలైన మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, హాలియా, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ పురపాలికల్లో అన్నపూర్ణ పథకాన్ని అమలు పర్చాల్సిన అవసరం ఉంది.




అమరావతి: రాజమహేంద్రవరం జైల్లో తెదేపా అధినేత చంద్రబాబుకు ఏం జరిగినా సీఎం జగన్‌దే బాధ్యతని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ అన్నారు. జైలులో అంతం చేసేందుకే చంద్రబాబును అరెస్టు చేశారనే అనుమానం ఉందన్నారు. ఈ మేరకు లోకేశ్ ట్వీట్ చేశారు. "మా అనుమానాలు ఇప్పుడు బలపడుతున్నాయి. చంద్రబాబును జైల్లోనే చంపేందుకు ప్లాన్ చేస్తున్నారు. ప్రతిపక్ష నేతకు జైల్లో హాని తలపెట్టేలా సర్కారు కుట్ర పన్నుతోంది. జైలులో విపరీతంగా దోమలు కుడుతున్నాయని చెప్పినా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదు. జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరానికి చెందిన గంజేటి వీరవెంకట సత్యనారాయణ డెంగీ బారినపడి మరణించారు.

చంద్రబాబునూ ఇలాగే చేయాలని సైకో కుతంత్రాలు అమలు చేస్తున్నారు. చంద్రబాబుకు ఏం జరిగినా సైకో జగన్‌దే బాధ్యత" అని లోకేశ్ ట్వీట్‌లో పేర్కొన్నారు.




దిల్లీ: రాజ్యసభలో వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. రాజ్యసభలో 'ఇండియాస్ గ్లోరియస్ స్పేస్ జర్నీ మార్క్‌డ్ బై సక్సెస్‌ఫుల్ సాఫ్ట్ ల్యాండింగ్ ఆఫ్ చంద్రయాన్-3' అన్న అంశంపై జరిగిన చర్చలో పాల్గొంటూ చంద్రబాబు గురించి మాట్లాడారు. "దేశంలో తాము ఎన్నో చేసినట్లు కాంగ్రెస్, భాజపా చెప్పుకొంటుండగా మధ్యలో మా రాష్ట్ర ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు వచ్చి సైన్స్‌కి తానెంతో చేసినట్లు ప్రకటించుకుంటున్నారు. ఎన్నోసార్లు ఆయన తానే కంప్యూటర్‌ను తయారుచేసినట్లు, అంతరిక్ష పరిశోధనకు తానే ఆద్యుడినని, సెల్‌ఫోన్‌ను తానే కనిపెట్టినట్లు ప్రకటించుకున్నారు" అని పేర్కొన్నారు. దాంతో ఆ సమయంలో తెదేపా సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్, భారాస సభాపక్ష నాయకుడు కె.కేశవరావు అడ్డుపడగా మీ మాట నేను వినదలచుకోలేదు, దయచేసి కూర్చోమని విజయసాయిరెడ్డి గద్దించారు. డీఎంకే సభాపక్ష నేత తిరుచ్చి శివ లేచి అభ్యంతరం వ్యక్తం చేయగా తన ప్రసంగానికి అడ్డుపడే హక్కు మీకు లేదంటూ ఆయనపైనా ఆగ్రహం వ్యక్తంచేసి, ప్రసంగాన్ని కొనసాగించారు. చంద్రబాబు నిజంగా అన్నీ కనిపెట్టారా అన్న విషయాన్ని మీరు విచారించి కనిపెట్టాలని వ్యాఖ్యానించారు. ఐటీ, కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను ఆయన కనిపెట్టింది నిజమైతే భారత్ దానిపై పేటెంట్ హక్కులు కోరొచ్చన్నారు. ఆ పేటెంట్ హక్కుల కింద బిలియన్ల రూపాయలు పొందొచ్చని వ్యంగ్యంగా అన్నారు. ఆ సమయంలో ప్రతిపక్ష సభ్యులు విజయసాయి ప్రసంగానికి అడ్డుతగులుతూ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తగా మొత్తం ప్రతిపక్షం అరాచకంగా వ్యవహరిస్తోందని వారిపై ఆరోపణలు గుప్పించారు. కాంగ్రెస్ అరాచక పార్టీ అని, మిగిలిన ప్రతిపక్షాలు వారితో చేరి దేశాన్ని అరాచకంగా మార్చాయని ఆరోపించారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగా ప్రధాన ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే సహా మిగిలిన ప్రతిపక్షపార్టీల సభ్యులంతా లేచి అభ్యంతరం వ్యక్తంచేశారు. దాంతో విజయసాయిరెడ్డి చంద్రబాబు గురించి చెప్పకుండా తనను అడ్డుకోలేరన్నారు. ఈ పార్టీలన్నీ అరాచకపార్టీలని, దేశంలో అలజడి సృష్టించడానికే అవి ప్రాధాన్యం ఇస్తున్నాయని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యల పట్ల ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఏవైనా అభ్యంతరకర వ్యాఖ్యలు ఉంటే పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని సభాధ్యక్ష స్థానంలో కూర్చున్న మమతా మోహంత హామీ ఇచ్చారు. చివరగా విజయసాయిరెడ్డి ప్రసంగం ముగించిన తర్వాత వామపక్ష సభ్యుడొకరు "బెయిల్ మీద ఉన్న నాయకుడు... జైల్లో ఉన్న నాయకుడిని ప్రశ్నిస్తున్నారు" (లీడర్ ఆన్ బెయిల్... క్వశ్చనింగ్ ది లీడర్ ఇన్ జైల్) అంటూ విజయసాయిరెడ్డిపై వ్యంగ్యాస్త్రం సంధించారు.

# తెలుగు సినీ పరిశ్రమను వైకాపా నేతలు కించపరిచారు: బాలకృష్ణ



అమరావతి: అసెంబ్లీలో తెలుగు సినిమా కళాకారులను వైకాపా ఎమ్మెల్యేలు ఘోరంగా అవమానించారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ధ్వజమెత్తారు. సినీ రంగం నుంచే ఎన్టీఆర్ అసెంబ్లీకి వెళ్లి ఎందరికో రాజకీయ భిక్ష పెట్టారని ఆయన గుర్తుచేశారు.

సభలో తనకు మాత్రమే అవమానం జరగలేదని, మొత్తం తెలుగు సినీ పరిశ్రమని అధికార పార్టీ నేతలు కించపరిచారని ఆరోపించారు. శాసనసభలో సస్పెండ్ అనంతరం మల్కాపురం గ్రామంలో తెలుగుదేశం ఎమ్మెల్యేలు మీడియా సమావేశం నిర్వహించారు.

**స్పీకర్ చేతా అబద్ధాలు చెప్పించారు!** తెలుగుదేశం అధినేత చంద్రబాబుపై పెట్టిన కేసు అక్రమమని, దీనిపై పోరాటం ఆపేది లేదని బాలకృష్ణ స్పష్టం చేశారు. అసెంబ్లీలో మీసం మెలేసి, తొడ కొట్టింది వైకాపా ఎమ్మెల్యేలేనన్న ఆయన.. తాను చేయని పనిని చేసినట్లు అసత్యాలు సృష్టించారన్నారు. స్పీకర్ చేతా అబద్ధాలు చెప్పించారని దుయ్యబట్టారు. మంద బలంతో విర్రవీగుతున్న వైకాపా ఎమ్మెల్యేలకు తగిన మూల్యం తప్పదన్నారు. ప్రజలే వారికి త్వరలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు?: అచ్చెన్న –** చంద్రబాబుపై అక్రమ కేసు పెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. చంద్రబాబుపై పెట్టిన కేసులు వెనక్కి తీసుకొని.. అసెంబ్లీలో సీఎం జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే నినాదంతో అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు. ఇవాళ అసెంబ్లీకి ఒక దుర్దినమన్న అచ్చెన్న.. 200 మంది మార్షల్స్‌ను పెట్టి సభ జరుపుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. స్పీకర్ తీరు చాలా దారుణంగా ఉందని మండిపడ్డారు. మంత్రి నేరుగా మీసం మెలేసి బూతులు తిట్టినా ఎలాంటి చర్యలు లేవని దుయ్యబట్టారు.

**జగన్ ఆస్తుల కేసు ప్రస్తావన రాకపోవడానికి ఏ ములాఖాత్ కారణం?:** ములాఖాత్, మిలాఖాత్‌లతోనే పుట్టిన పార్టీ వైకాపా అని ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. దిల్లీకి సీఎం వెళ్లి ఎవరితో ములాఖాత్, మిలాఖాత్ అవుతున్నారని ప్రశ్నించారు. దశాబ్ద కాలంగా జగన్ ఆస్తుల కేసు ప్రస్తావన రాకపోవడానికి ఏ ములాఖాత్, మిలాఖాత్ కారణమని నిలదీశారు. స్కిల్ కేసులో ఒక్క రూపాయి కూడా పక్కకు పోలేదన్నారు. 144 సెక్షన్, 30ఏ చట్టాలను అసెంబ్లీలోనూ సీఎం జగన్ అమలు చేస్తున్నారని తెదేపా శాసనసభా పక్ష ఉపనేత నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టుపై వాస్తవాలు తెలియాలంటే.. తమ పవర్ పాయింట్ ప్రదర్శనకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.




అమరావతి: విరామం అనంతరం తిరిగి ఏపీ శాసనమండలి ప్రారంభమైంది. పలు బిల్లులు టేబుల్ చేస్తున్నట్టు ఛైర్మన్ ప్రకటించారు. దీంతో మళ్లీ టీడీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. పోడియంపైకి దూసుకువెళ్లి నిరసన తెలిపారు.

చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండించాలంటూ ఆందోళన చేశారు. ఈ క్రమంలో మంత్రి జోగి రమేష్ జోక్యం చేసుకుంటూ పెద్దల సభలో ఛైర్మన్‌ను అగౌరవ పరుస్తూ వ్యవహరించడం దారుణమన్నారు. చంద్రబాబు ఎందుకు అరెస్టు అయ్యారు దానిపై చర్చించాలంటున్నారు.. దానిపై చర్చకు తాము సిద్ధమని అన్నారు.

చంద్రబాబుకు వ్యతిరేఖంగా మంత్రి మాట్లాడుతుండగానే వైసీపీ ఎమ్మెల్సీలు నిరసన చేపట్టారు. చంద్రబాబు అవినీతిపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, సొమ్ము వారికి ఎలా చేరిందో చెపుతామని మంత్రి అన్నారు. ఈ క్రమంలో చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేఖంగా టీడీపీ సభ్యులు ప్లకార్డులు పట్టుకుని ఛైర్మన్ పోడియం వద్ద ప్రదర్శించారు. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో ఛైర్మన్ సభను శుక్రవారం నాటికి వాయిదా వేశారు.

# 'బావ కళ్లలో ఆనందం కోసమే బాలయ్య మీసాలు మెలేస్తున్నాడు'

అమరావతి: ఏపీ అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ఈరోజు ప్రారంభం కాగా, టీడీపీ సభ్యులు ఓవరాక్షన్ చేసి సభలో హంగామా సృష్టించారు. టీడీపీ సభ్యులు అతి చేయడంతో అసెంబ్లీ ప్రారంభం కాగానే వాయిదా పడింది. వాయిదా తర్వాత అసెంబ్లీ తిరిగి ప్రారంభమైనప్పటికీ టీడీపీ సభ్యులు తమ తీరు మార్చుకోలేదు. స్పీకర్ పోడియాన్ని చుట్టిముట్టి ఫైళ్లు విసిరేశారు. టీడీపీ సభ్యుల ఆందోళన సరికాదని స్పీకర్ తమ్మినేని సీతారాం పదే పదే విజ్ఞప్తి చేసినా వారు తీరు మార్చుకోలేదు. ఈ క్రమంలోనే పలువురు టీడీపీ సభ్యులు సమావేశాలు ముగిసేవరకూ సస్పెండ్ కాగా, కొంతమందిపై ఒకరోజు సస్పెన్షన్ పడింది. సభలో బాలకృష్ణ సభలో మీసాలు తిప్పి రెచ్చగొట్టే చర్యలకు శ్రీకారం చుట్టాడు.

దాంతో అసెంబ్లీ రెండోసారి వాయిదా పడింది. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సాక్షి టీవీతో మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ.. 'పబ్లిసిటీ కోసమే టీడీపీ నేతల హడావిడి చేస్తున్నారు. సభాపతిపై టీడీపీ నేతలు ఫైల్స్ విసిరేసి, బాటిల్స్ పగలగొట్టి నానా హంగామా సృష్టించారు. సభా మర్యాదను అగౌరవ పరిచేలా బాలకృష్ణ ప్రవర్తన ఉంది. బావ కళ్లలో ఆనందం కోసమే బాలకృష్ణ మీసాలు మెలేస్తున్నాడు. బాలకృష్ణ సభను సినిమా షూటింగ్ అనుకుంటున్నాడు.




చంద్రబాబు అవినీతి చేసి దొరికిపోయిన దొంగ. తొమ్మిదేళ్లలో ఎన్నిసార్లు బాలకృష్ణ సభకు వచ్చాడు. తనకు ఓటేసిన హిందూపురం ప్రజల సమస్యల కోసం ఏనాడైనా బాలకృష్ణ మాట్లాడాడా?, అక్రమంగా ప్రజల డబ్బును దోచేసి చంద్రబాబు అరెస్ట్ అయ్యాడు. చర్చ జరిగితే చంద్రబాబు అవినీతి మొత్తం బయటికి తీస్తాం. దమ్ముధైర్యం ఉంటే బాలకృష్ణ చర్చకు సిద్ధమై సభకు రావాలి. ఎంత సేపైనా చర్చించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని స్పష్టం చేశారు.

# విజయదశమి నుంచి విశాఖలో జగన్ పాలన

విశాఖ: రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఆయన విజయగణపతికి ప్రత్యేక పూజులు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ విజయదశమి నుంచి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖ నుంచి పరిపాలన సాగించనున్నారని, విఘ్నాలు ఉన్నా తొలిగిపోవాలని పూజులు చేశామని అన్నారు. మళ్లీ జగనే సీఎం అవ్వాలని గణనాధుడిని పూజించామన్నారు.

మూడు రాజధానులకు న్యాయపరమైన ఇబ్బందులు రావడం వలన కాస్త ఆలస్యం అయిందని, ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. ఉత్తరాంధ్రా ప్రజలకు భరోసా కల్పించనున్నామని, దక్షిణ భారతదేశంలోనే అభివృద్ధి చెందిన నగరం విశాఖ అని ఆయన అన్నారు. విశాఖలో కార్యాలయాలను సిద్ధం చేస్తున్నామని, ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వైవి సుబ్బారెడ్డి తెలిపారు. విశాఖ రాజధానికి అనుకూలంగా ఉంటుందనే.. కేంద్రం




కూడా విశాఖను అభివృద్ధి చేయనుందని చెప్పారు. చంద్రబాబు అవినీతి చేసి అడ్డంగా దొరికిపోయారని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని, కోర్టులపైన తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. టీడీపీ ఇబ్బందుల్లో ఉందని, ఆ పార్టీని నడిపించడానికి వేరొక నాయకుడికి అప్పగించిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైసీపీ సిద్ధంగా ఉందని వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.




టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా విదేశాల్లో ఉండే ఎన్నారైలు ర్యాలీలు చేస్తూ చంద్రబాబుకు మద్దతు తెలుపుతున్నారు. పార్టీలకు అతీతంగా కూడా పలువురు సీనియర్ నేతలు చంద్రబాబు అరెస్టును ఖండిస్తున్నారు. ఇండియా కూటమికి చెందిన మమతా బెనర్జీ, అఖిలేష్ యాదవ్, సుఖ్‌బీర్ సింగ్ బాదల్, కుమారస్వామి లాంటి నేతలు చంద్రబాబును రాజకీయ కక్షతోనే అరెస్ట్ చేశారని అభిప్రాయపడ్డారు. అటు సినీ పరిశ్రమలో పలువురు ప్రముఖులు కూడా చంద్రబాబు అరెస్ట్ అంశంపై స్పందించారు. కోలీవుడ్‌లోనూ రజనీకాంత్, విశాల్ లాంటి హీరోలు టీడీపీ అధినేత అరెస్టును ఖండిస్తూ ప్రకటనలు చేశారు. తాజాగా కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నేత నితిన్ గడ్కరీ కూడా చంద్రబాబు అరెస్టుపై స్పందించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని టీడీపీ ఎంపీ కేశినేని నాని సోషల్ మీడియా ద్వారా స్వయంగా వెల్లడించారు. దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, టీడీపీ ఎంపీ కేశినేని నాని మధ్య చంద్రబాబు అరెస్ట్ అంశం చర్చకు వచ్చినట్లు తెలస్తోంది. ఈ రోజు పార్లమెంటు ఆవరణలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఎదురుపడ్డారని.. ఆయన చంద్రబాబు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారని కేశినేని నాని చెప్పారు. చంద్రబాబు గొప్ప నాయకుడు అని.. ఆయన ఎటువంటి తప్పు చేసే వ్యక్తి కాదని మచ్చ లేని ప్రజా సేవకుడని.. భగవంతుని ఆశీస్సులతో అన్ని విఘ్నాలు తొలిగించుకుని కడిగిన ముత్యంలాగ బయట పడతారని నితిన్ గడ్కరీ నమ్మకం వ్యక్తం చేశారని కేశినేని నాని వివరించారు. కాగా చంద్రబాబు ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆయనకు విధించిన రిమాండ్ ఈనెల 21తో ముగియనుంది. చంద్రబాబును కస్టడీకి ఇవ్వాలని సీఐడీ.. ఆయనకు బెయిల్ ఇవ్వాలని టీడీపీ తరఫు న్యాయవాదులు ఏపీ హైకోర్టులో వాదిస్తున్నారు.

# జైలులో రిమాండ్ ఖైదీ మృతి.. డీఐజీ ఏమన్నారంటే..



అమరావతి: రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ గంజేటి వీర వెంకట సత్యనారాయణ మృతిపై జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ స్పందించారు. దోపిడీ కేసులో ఈనెల 6న సత్యనారాయణ జైలుకు వచ్చాడని.. జ్వరం, ప్లేట్‌లెట్లు లక్షన్నరకు పడిపోవడంతో 7న రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించామన్నారు. అత్యవసర వైద్య సహాయం కోసం ఈనెల 19న కాకినాడ జీజీహెచ్‌కు తరలించామని డీఐజీ చెప్పారు. డెంగ్యూతో రిమాండ్ ఖైదీ బుధవారం మృతిచెందారని తెలిపారు. జైలులో దోమల నివారణకు సంబంధిత శాఖతో కలిసి చర్యలు చేపట్టామన్నారు. ఫాగింగ్ చేశామని.. ఇవాళ కూడా చేస్తామని చెప్పారు. జైలులో దోమల లార్వా ఆనవాళ్లేమీ లేవని డీఐజీ తెలిపారు.

# ఏడాది కాలంగా జగన్ ఆస్తుల కేసు ఎందుకు రావడం లేదు?..

అమరావతి: ములాఖత్.. మిలాఖత్‌లతోనే పుట్టిన పార్టీ వైకాపా కదా..? ఢిల్లీకి సీఎం జగన్ వెళ్లి ఎవరితో ములాఖత్.. మిలాఖత్ అవుతున్నారని ప్రజా పద్దుల కమిటీ ఛైర్మన్ పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. గురువారం ఆయన అసెంబ్లీ వద్ద మీడియాతో మాట్లాడుతూ దశాబ్ద కాలంగా సీఎం జగన్ ఆస్తుల కేసు ప్రస్తావన రాకపోవడానికి ఏ ములాఖత్.. మిలాఖత్ కారణమని నిలదీశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఒక్క రూపాయి కూడా పక్కకు పోలేదన్నారు. ఎవరైనా ఆధారాలు సేకరించి అరెస్ట్ చేస్తారని.. కానీ అరెస్ట్ చేసి ఆధారాలు సేకరిస్తామని సీఐడీ అధికారులు నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. టీడీపీ శాసనసభ పక్ష ఉపనేత నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ 144 సెక్షన్, 30ఏ చట్టాలను అసెంబ్లీలోనూ సీఎం జగన్ అమలు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అరెస్టుపై వాస్తవాలు తెలియాలంటే తమ పవర్ పాయింట్ ప్రదర్శనకు అనుమతి ఇవ్వాలని కోరారు. అక్రమ కేసులో డొల్ల తనం బయటపడుతుందనే తమ పవర్ పాయింట్ ప్రదర్శనకు అనుమతి




ఇవ్వలేదన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఓ ఖైదీ డెంగ్యూ వ్యాధితో చనిపోయాడని అన్నారు. డెంగ్యూ వ్యాధితో ఖైదీ చనిపోవడంతో తమ అధినేత చంద్రబాబు భద్రత.. ఆరోగ్యంపై తమకు ఆందోళన ఉందని అచ్చెన్నాయుడు అన్నారు.

## మిలమిల మెరిసే మగువా.. నువ్వు మేనక చెల్లెలివా..!

మలయాళ భామ కళ్యాణి ప్రియదర్శన్ సెలెక్టెడ్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తుంది. హీరోయిన్స్ కి ఒక్కొక్కరికి ఒక్కో సెపరేట్ స్టైల్ ఉంటుంది. కొందరు కేవలం నటన మీద దృష్టి పెడితే ఆడియన్స్ మనసులు గెలిచేందుకు గ్లామర్ తో కూడా ప్రేక్షకులను మెప్పించే వారు కొందరు. సినిమాల సెలక్షన్ లో తన స్పెషాలిటీ చూపిస్తున్న కళ్యాణి ప్రియదర్శన్ సినిమాలతో పాటు ఫోటో షూట్స్ తో కూడా అలరిస్తుంది. తెలుగులో హలో చిత్రలహరి రెండు సినిమాలతో ఇక్కడ ఆడియన్స్ ని అలరించిన కళ్యాణి ప్రియదర్శన్ ఆ



తర్వాత మళ్లీ తెలుగులో మరో సినిమా చేయలేదు. సొంత భాష మలయాళంలో వరుస సినిమాలు చేస్తున్న అమ్మడు తమిళ్ లో శివకార్తికేయన్ హీరోగా వచ్చిన హీరో సినిమాలో నటించింది. ఆ తర్వాత యాంథాలజీగా వచ్చిన పుథుం పుదు కాలై వెబ్ సీరీస్ లో నటించింది కళ్యాణి ప్రియదర్శన్. శింబు హీరోగా వచ్చిన మానాడు సినిమాలో కూడా నటించింది కళ్యాణి ప్రియదర్శన్. ఆ తర్వాత 3 ఏళ్ల గ్యాప్ తో మరో తమిళ సినిమా ఓకే చేసింది కళ్యాణి ప్రియదర్శన్. జయం రవి హీరోగా వస్తున్న సినిమాలో కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్ గా ఫిక్స్ అయ్యింది. ఈ సినిమాలో కృతి శెట్టి కూడా స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. జినీ టైటిల్ తో వస్తున్న ఈ సినిమా ఓపెనింగ్ రోజు శారీ లుక్స్ తో సర్ ప్రైజ్ చేసింది కళ్యాణి ప్రియదర్శన్. తన క్యూట్ లుక్స్ తో ప్రేక్షకులను తన మాయలో పడేస్తున్న అమ్మడు శారీ లుక్స్ తో మరింత మెరిసిపోతుంది. కళ్యాణి ప్రియదర్శన్ లేటెస్ట్ శారీ ఫోటోలు తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. లైట్ బ్లూ కలర్ శారీ.. మ్యాచింగ్ బ్లౌజ్ తో తన శారీ లుక్స్ తోనే సూపర్ అనిపించేస్తుంది కళ్యాణి. ఈ ఫోటోలు చూసిన ఆమె ఫాలోవర్స్ అంతా కూడా కళ్యాణి కేరాఫ్ క్యూట్ లుక్స్ అంటూ కామెంట్ చేస్తున్నారు. ఫోటో షూట్ అంటే శృతిమించిన గ్లామర్ షో చేయడం కామన్ కానీ కళ్యాణి మాత్రం తన బోర్డర్స్ ని క్రాస్ చేయకుండా మెప్పిస్తూ వస్తుంది. తనకు ఇచ్చిన పాత్రకు న్యాయం చేస్తూ ఆడియన్స్ హృదయాలను గెలిచేస్తున్న కళ్యాణి ప్రియదర్శన్ మలయాళంలో వరుస హిట్లతో దూసుకెళ్తుండగా అమ్మడికి మిగతా భాషల నుంచి కూడా మంచి అవకాశాలు వస్తున్నాయి. జయం రవి తో చేస్తున్న జినీ సినిమాను నూతన దర్శకుడు అర్జునన్ జె.ఆర్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమా లో తన పాత్ర చాలా స్పెషల్ గా ఉంటుందని చెబుతుంది కళ్యాణి.

## హీరోల వయసుతో సంబంధం లేదంటున్న శృతి హాసన్..!

కమల్ గారాల పట్టి శృతి హాసన్ ప్రస్తుతం తెలుగులో మళ్లీ ఫామ్ లోకి వచ్చింది. కెరీర్ మొదట్లో వరుస ఫ్లాపులతో ఐరన్ లెగ్ ముద్ర వేసుకున్న అమ్మడు పవన్ కళ్యాణ్ గబ్బర్ సింగ్ తో సూపర్ హిట్ అందుకుంది. ఇక అక్కడ నుంచి వరుస స్టార్ సినిమాలు చేస్తూ సూపర్ పాపులర్ అయ్యింది శృతి హాసన్. తనకు హీరోయిన్ గా స్టార్ ఇమేజ్ వచ్చింది తెలుగు సినిమాల వల్లే అంటూ రీసెంట్ ఓ స్పెషల్ చిట్ చాట్ లో చెప్పుకొచ్చింది శృతి హాసన్. అందుకే తెలుగు పరిశ్రమ మీద విశ్వాసంగా ఉంటానని అంటుంది శృతి హాసన్. అంతేకాదు కథ నచ్చితే హీరోల వయసు గురించి పట్టించుకోను.. చిరంజీవి గారితో చేసిన వాల్తేరు వీరయ్య బాలకృష్ణ గారితో చేసిన వీర సింహా రెడ్డి ఈ రెండు సినిమాలు కథ నచ్చబట్టే చేశానని అలాగే



ఆ రెండు సినిమాలు పెద్ద హిట్ అయ్యానని అన్నారు శృతి హాసన్. ప్రస్తుతం ది ఐ అనే హాలీవుడ్ సినిమాతో పాటుగా ప్రభాస్ తో సలార్ సినిమా చేస్తున్నానని చెప్పుకొచ్చారు. ప్రశాంత్ నీల్ టేకింగ్ ఒక లెవల్ లో ఉంటుంది. అయితే ఆ సినిమా గురించి తాను ఇప్పుడు ఎక్కువగా చెప్పలేనని అన్నారు శృతి హాసన్. తొలి సినిమా హిందీలో చేశా.. నాన్న కమల్ హాసన్ బ్యానర్ లో రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లో హీరోయిన్ గా ఛాన్స్ ఇస్తే చేస్తానని అన్నారు. సినిమాల్లో ప్రత్యేకంగా జీవిత లక్ష్యమేమి లేదని.. సొంత కాళ్లపై ధైర్యంగా నిలబడటమే ముఖ్యమని అన్నారు. జీవితంలో పెళ్లి ఒక భాగం మాత్రమే అదే జీవితం కాదని అన్నారు శృతి హాసన్. డిప్రెషన్ తో బాధపడుతున్న వారికి కౌన్సిలింగ్ అనేది బాగా అవసరం.. అలాంటి బాధితులు కూడా తమ బాధలను బహిరంగంగా వ్యక్తపరచాలి.. వారి కోసం ఒక సంస్థను ఏర్పాటు చేస్తున్నానని అన్నారు శృతి హాసన్.




## మాస్ రాజా.. హై లెవెల్ టైగర్



మాస్ మహారాజ్ రవితేజ ఈ దసరాకి టైగర్ నాగేశ్వరరావుతో ప్రేక్షకుల ముందుకి రాబోతున్నారు. పాన్ ఇండియా రేంజ్ లో ఈ చిత్రం రిలీజ్ కి రెడీ అవుతోంది. మాస్ రాజా మూవీలో రియల్ లైఫ్ రాబిన్ హుడ్ గా పేరుపొందిన టైగర్ నాగేశ్వరరావు పాత్రలో కనిపించబోతున్నారు. ఈ కథపైన, నాగేశ్వరరావు పాత్రపైన దర్శకుడు వంశీ కృష్ణ ఆకెళ్ళ ఎంతో రీసెర్చ్ చేసి సినిమా సిద్ధం చేస్తున్నారు. ఓ వైపు స్టువర్టుపురం గ్రామ ప్రజల నుంచి సినిమాపై కొంత వ్యతిరేకత వస్తోంది. అయిన కూడా వెనక్కి తగ్గకుండా గ్రాండియర్ లో టైగర్ నాగేశ్వరరావు కథని చెప్పడానికి వంశీ కృష్ణ ముందుకి వెళ్తున్నారు. అభిషేక్ అగర్వాల్ పిక్చర్స్ బ్యానర్ పై ఈ చిత్రం భారీ బడ్జెట్ తో నిర్మితమవుతోంది. ఓ విధంగా చెప్పాలంటే రవితేజ కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో ఈ మూవీ తెరకెక్కడం విశేషం. మాస్ మహారాజ్ మార్కెట్ వేల్యూకి మించి ఈ సినిమా కోసం ఖర్చు పెట్టారు. అందుకే ఏకంగా ఐదు ఇండియన్ భాషలలో మూవీని ఏక కాలంలో రిలీజ్ చేస్తున్నారు. అక్టోబర్ 20న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్ లోకి ఈ చిత్రం రాబోతోంది. దానికి తగ్గట్లుగానే ప్రమోషన్ యాక్టివిటీస్ చేయాలని చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది. నార్త్ ఇండియాపైన కూడా గట్టి ఫోకస్ పెట్టారు. రవితేజ కెరియర్ లో అత్యధిక థియేటర్స్ లో ఈ మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. రావణాసుర లాంటి డిజాస్టర్ తర్వాత మాస్ మహారాజ్ రవితేజ నుంచి ఈ మూవీ రాబోతోంది. ఇప్పటికే డిజిటల్, ఆడియో రైట్స్ అత్యధిక ధరకి అమ్ముడైపోయాయి. థీయాట్రికల్ బిజినెస్ డీల్స్ కూడా క్లోజ్ అయినట్లు తెలుస్తోంది. 55 కోట్ల వరకు రిలీజ్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలలోని 30 కోట్ల మేరకు థీయాట్రికల్ బిజినెస్ టైగర్ నాగేశ్వరరావుపై జరిగింది. 1970 బ్యాక్ డ్రాప్ లో నడిచే ఈ కథలో నుపూర్ సనన్ హీరోయిన్ గా నటిస్తూ ఉండగా, రేణు దేశాయ్ ఓ కీలక పాత్రలో కనిపించబోతోంది. యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో ఈ మూవీ కథాంశం ఉండబోతోంది. సినిమాలో రాబరీ కింగ్ గా రవితేజ కనిపిస్తాడు.

## పిక్ టాక్ : 'ఓరి దేవుడా' ఏంటి ఈ అందం



విశ్వక్ సేన్ హీరోగా వెంకటేష్ కీలక పాత్రలో నటించిన ఓరి దేవుడా సినిమా లో మిథిలా పాల్కర్ హీరోయిన్ గా నటించి తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన విషయం తెల్సిందే. చూడడానికి క్యూట్ గా చిన్నగా అనిపిస్తున్న ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ వైరల్ అవుతున్నాయి. ఈ అమ్మడు సినిమాలు.. సిరీస్ లు ఇంకా టీవీ షో లు చేయడం ద్వారా ఉత్తర భారతంలో మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. ఈమె కమర్షియల్ యాడ్స్ లో కూడా కనిపించడం ద్వారా చాలా మందికి సుపరిచితురాలు అయ్యింది.

ఇప్పుడు ఇలా అందాల ఆరబోత చేయడం వల్ల మరింతగా ఆకట్టుకుంటుంది. ఈ అమ్మడి యొక్క క్లీవేజ్ షో మరియు నడుము అందం చూపిస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తున్న మిథిలా పాల్కర్ ను తెలుగు లో మరిన్ని సినిమాల్లో చూడాలని కొందరు అనుకుంటూ ఉంటే.. స్టార్ హీరోయిన్ అయ్యే ఫీచర్స్ ఉన్నాయి అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. 2014 లో మరాఠీ షార్ట్ ఫిల్మ్ తో అందరి దృష్టిని ఆకర్షించిన మిథిలా ఆ తర్వాత హిందీ సినిమా లు మరియు సిరీస్ లతో మెప్పించింది.

ఆ తర్వాత కమర్షియల్ యాడ్స్ తో అలరించింది. ఇప్పుడు తెలుగు సినిమాల్లో బిజీ అయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తే కచ్చితంగా ముందు ముందు ఈ అమ్మడి కి బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## అందంతో కట్టిపడేస్తున్న స్పై పిల్ల

టాలెంటెడ్ యంగ్ హీరో నిఖిల్ ఇటీవల స్పై మూవీ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ మూవీ లో ఎక్కువ మంది సినిమా లో కంటెంట్ కన్నా కూడా హీరోయిన్ కి ఎక్కువ ఫిదా అయిపోయారు. మూవీ ఫలితం ఎలా ఉన్నా ఈ బ్యూటీకి మాత్రం ఫ్యాన్స్ పెరిగిపోయారు. ఆమే ఐశ్వర్యా మేనన్. తన అందంతో అందరనీ ఆకర్షించింది. ఈ బ్యూటీ డైరెక్ట్ తెలుగు సినిమా ఇదే అయినప్పటికీ గతం లోనూ ఓ సినిమా తో తెలుగు ప్రేక్షకుల ను పలకరించింది. లవ్ ఫెయిల్యూర్ అనే అనువాద చిత్రం తో ఆమె తెలుగు తెరకు పరిచయం అయ్యారు. అయితే ఆ మూవీ పెద్దగా



ఆకట్టుకోకపోవడంతో ఆమెకు మళ్లీ టాలీవుడ్ లో కనిపించలేదు. మళ్లీ చాలా కాలం తర్వాత స్పై లో మెరిసింది. అయితే ఆమెకు తెలుగు లో ఛాన్సులు రాకపోయినాతమిళం మళయాళ సినిమాల్లో బాగానే అవకాశాలు వచ్చాయి. ఇక ఈ బ్యూటీ సోషల్ మీడియా లోనూ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలు షేర్ చేసి ఫ్యాన్స్ ని ఊరిస్తూ ఉంటుంది. తాజాగా ఎరుపు రంగు డ్రెస్ లో మెరిసింది. ఆ డ్రెస్ లో ఆమె చాలా హాట్ గా కనిపించడం విశేషం. స్లీవ్ లెస్ డ్రెస్ లో హొయలు పోయింది. తన థైస్ క్లియర్ గా కనిపించేలా షో చేసింది. ఇప్పుడు ఈ ఫోటోలు నెట్టింట ఫ్యాన్స్ ని విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇదిలా ఉండగా ఈ బ్యూటీకి ఇటీవల మరో బంపర్ వచ్చింది. పవన్ ఓజీ లో ఆమెకు ఛాన్స్ దక్కింది. పవన్ కళ్యాణ్ హీరో గా సాహో ఫేమ్ సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ బడ్జెట్ మూవీ OG. ఈ సినిమా ను డివివి దానయ్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ ను ప్రారంభించుకున్న ఈ చిత్రం 50 శాతం పూర్తయ్యింది. ఈ సినిమా లో కోలీవుడ్ హీరోయిన్ ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తున్నారు. మరో హీరోయిన్ గా ఐశ్వర్యను ఎంపిక చేశారు. ఈ ఏడాది డిసెంబర్ నెలలో OG సినిమా ను విడుదల చేయాలనేది మేకర్స్ భావిస్తున్నట్లు తెలుస్తుంది.

## ఎద అందాలతో మెరిసిపోతున్న రాశిఖన్నా

టాలీవుడ్ హాట్ బ్యూటీ రాశిఖన్నా ఈ మధ్య గ్లామర్ డోస్ కాస్త పెంచింది అని చెప్పాలి. టాలీవుడ్ లో సూపర్ సక్సెస్ అందుకున్న ఈ అమ్మడు ఫోకస్ అంతా ఇప్పుడు బాలీవుడ్ మీద ఉంది. హిందీలో రెండు సినిమాలు ఈమె చేతిలో ఉన్నాయి. ఇక ఇప్పటికే డిజిటల్ ఎంట్రీ కూడా ఇచ్చిన రాశిఖన్నా డిఫరెంట్ క్యారెక్టర్స్ తో దూసుకుపోతుంది. హీరోయిన్ గానే కాకుండా మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలకి కూడా ఓకే చెబుతుంది. రెగ్యులర్ కమర్షియల్ హీరోయిన్ ఇమేజ్ నుంచి బయటకి రావాలని ప్రయత్నం చేస్తున్న ఈ బ్యూటీ ఆ దిశగానే తన సినిమాల ఎంపిక కూడా చేసుకుంటూ ఉండటం విశేషం. రాశిఖన్నా చివరిగా తెలుగులో నాగ చైతన్య హీరోగా దిల్ రాజు ప్రొడక్షన్ లో వచ్చిన థాంక్యూ మూవీలో నటించింది. ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. తమిళంలో కార్తికి జోడీగా సర్దార్ సినిమాలో నటించింది.



ఇక ఫర్జీ అనే వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఈ మూవీలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గా రాశిఖన్నా నటించి మెప్పించింది. షాహిద్ కపూర్ కి జంటగా రొమాంటిక్ సన్నివేశాలలో కూడా ఈ అమ్మడు రెచ్చిపోవడం విశేషం. ఇదిలా ఉంటే హిందీలో యోద సినిమాలో ప్రస్తుతం నటిస్తుంది. ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. అలాగే తమిళంలో కూడా ఒక సినిమాలో నటిస్తుంది. ఇదిలా ఉంటే ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో రాశిఖన్నా యాక్టివ్ గా ఉంటుంది. హాట్ హాట్ ఫోటోలని రెగ్యులర్ గా ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ కుర్రాళ్ళకి చెమటలు పట్టిస్తుంది. తాజాగా ఈ అమ్మడు పింక్ విల్లా ఫ్యాషన్ ఈవెంట్ లో సందడి చేసింది. ఈ ఈవెంట్ లో పింక్ కలర్ మోడరన్ అవుట్ ఫిట్ తో మెరిసిపోయింది. ఈ కాస్ట్యూమ్స్ లో ఎద అందాలని చూపిస్తూ కుర్రాళ్ళని రాశిఖన్నా టెంప్ట్ చేస్తుంది. ఈ ఫోటోలు ప్రస్తుతం ఇన్స్టాగ్రామ్ లో వైరల్ గా మారాయి. వీటిని ఏకంగా2.30 లక్షల మంది లైక్ చేయడం విశేషం.



# ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ భేటీ.. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశమైంది. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ నేతృత్వంలో సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. సమావేశానికి మాణిక్ రావు ఠాక్రే, పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మధుయాష్కీ, భట్టి విక్రమార్క, జిగ్నేష్ మేహావని, బాబా సిద్ధిక్ హాజరయ్యారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే వారి నుంచి కాంగ్రెస్ దరఖాస్తులను స్వీకరించింది. దీంతో భారీగానే అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కొన్ని చోట్ల ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. త్వరలోనే ఫస్ట్ విడుదల చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఇదిలా ఉంటే అక్టోబర్ మొదటి వారంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇప్పటికే అధికార పార్టీ బీఆర్ఎస్ తొలి లిస్ట్‌ను విడుదల చేసింది. ఇదిలా ఉంటే హైదరాబాద్‌లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక పూర్తయినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన నివేదిక రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం హైకమాండ్ ముందు పెట్టినట్లు సమాచారం. ఇదిలా ఉంటే మొత్తం 300 మంది పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. చివరికి ఎవర్ని అదృష్టం వరిస్తుందో మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

# పేదలను బ్రహ్మాండంగా ఆదుకోవాలని కేసీఆర్ ఆలోచన చేస్తున్నారు..

## ఆ విషయాలను తొందరలోనే సీఎం చెబుతారు : మంత్రి కేటీఆర్



ఢిల్లీ, బెంగళూరు నుంచి వచ్చి ఇచ్చే హామీలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు మంత్రి కేటీఆర్ సూచించారు. దుండిగల్‌లో రెండో విడత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. వరితో గెలవలేక.. ఇదివరకు ఏం చేసింద్రో చెప్పలేక.. కొత్త రూపాల్లో వస్తున్నారని.. ఇష్టమొచ్చిన హామీలు ఇస్తున్నారని తెలిపారు. వాళ్లు ఇచ్చి హామీలు నమ్మి మోసపోదామా? అని ప్రశ్నించారు. ప్రజలు తొందరపడొద్దని.. ప్రజలు, రైతులపై కేసీఆర్ కంటే ఎక్కువ ప్రేమ ఉన్న నాయకులు భారతదేశంలో ఎవరైనా ఉన్నారా అని ఆలోచించుకోవాలని సూచించారు. వాళ్లు చెప్పినదానికంటే ఎక్కువ సంక్షేమ కార్యక్రమాలు చేయాలని కేసీఆర్‌కు కూడా ఉందని అన్నారు. తప్పకుండా వాళ్ళు చెప్పినదానికంటే బ్రహ్మాండంగా పేదలను ఆదుకోవాలని కేసీఆర్ ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ఆ విషయాలను తొందరలోనే సీఎం కేసీఆర్ చెబుతారని పేర్కొన్నారు.

కొత్తగా రాష్ట్రం ఏర్పాటైనప్పటికీ ఈ తొమ్మిదేండ్లలో అభివృద్ధి, సంక్షేమంలో జోడెద్దుల మాదిరిగా తెలంగాణ రాష్ట్రం ప్రగతి బాటలో ముందుకెళ్తున్నదని అన్నారు. ‘ ఒకప్పుడు హైదరాబాద్‌లో ఏ బస్తీకి పోయినా మంచి నీళ్ల కోసం లొల్లి. ఖైరతాబాద్ జలమండలి ముందు నుంచి వెళ్లామంటే భయం. ఎప్పుడు చూసినా ఖాళీ బిందెలు, ఖాళీ కుండలు పెట్టి ధర్నాలు చేసేవాళ్లు. కరెంటు గోస చెప్పక్కర్లేదు. అపార్ట్‌మెంట్ కిందకు వెళ్తే డీజిల్ కంపుతో ముక్కులు పగిలిపోయేవి. ఇన్వర్టర్లు, జనరేటర్లు లేకపోతే జ్యూస్ స్టాల్, జిరాక్స్ సెంటర్లు నడుపుకోలేని అవస్థ. గణేశ్ పండగ వచ్చిందంటే వారం రోజులు కర్ఫ్యూ కంపల్సరీ.’ ఉండేదని గుర్తుచేశారు. ఇవాళ ఆ పరిస్థితులు ఉన్నాయా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగున్నాయని.. మంచినీళ్ల సవులత్ మంచిగైందని.. రోడ్లు బాగైనయని.. పేదలకు కడుపు నిండా పింఛన్ వస్తున్నదని.. డబుల్ బెడ్రూం ఇండ్లు వస్తున్నాయని తెలిపారు. ఇన్ని పనులు చేసుకుంటూ ముందుకుపోతున్న ఈ ప్రగతి చక్రాలను ఆపేందుకు.. వాటికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల ముందు కొంతమంది వస్తున్నారని తెలిపారు.

సంక్రాంతికి గంగిరెద్దు వచ్చినట్టుగా ఎన్నికల ముందు ఇష్టమొచ్చినట్టు మాటలు చెప్పే వాళ్లు వస్తున్నారని ఎద్దేవా చేశారు. అలాంటి వాళ్ల మాటలకు మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నాపై తప్పుడు రాతలు బాధించాయి



హైదరాబాద్: తనకు ఎవరూ శత్రువులు లేరు... కానీ తనపై కొంతమంది చెడు రాతలు రాస్తున్నారని అలా రాయడం ఎంతో బాధించిందని బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. గురువారం నాడు బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..“సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదు. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం హామీలు ఇచ్చి ఆ తర్వాత మర్చిపోతున్నారు. దళిత బంధు పూర్తిగా ఎందుకు అమలు చేయడం లేదు. నిరుద్యోగ భృతి ఏమైంది. వైన్స్ టెండర్ల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యాపారస్తుల జేబులు కత్తిరించింది. రుణమాఫీ కాక రైతులు నష్టపోతున్నారు. 57ఏళ్లకే పెన్షన్లు , వితంతు పెన్షన్లు కూడా ఇస్తానని ఇవ్వడం లేదు. డబ్బు లేకనే ఈ పథకాలను అమలు చేయడం లేదు. రాష్ట్రం దివాళా తీసిందని కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలవుతాయా లేదా ఆలోచించుకోవాలి. గతంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన అనుభవంతో చెబుతున్నా కాంగ్రెస్ నేతలు ఏది పడితే ఆ పథకం ప్రకటించకండి. ఏ మహిళలకు రెండు వేల రూపాయలు ఇస్తారు. ఈ ఆరు హామీలను ఎలా అమలు చేస్తారో కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేయాలి. కర్ణాటకలో వలవికానీ హామీల ఇచ్చి.. ప్రభుత్వం ఏర్పాటు చేశాక చేతులెత్తేశారు. రాష్ట్రంలో వచ్చే ఆదాయంపై బీజేపీకి మంచి అవగాహన ఉంది. అణగారిన వర్గాలకు ఎలా సంక్షేమ పథకాలు అమలు చేయాలో బీజేపీ అధిష్ఠానం స్టడీ చేసిన తర్వాత ప్రకటిస్తాం. అతి త్వరలోనే మంచి మేనిఫెస్టోను ప్రకటిస్తాం. జాతీ నాయకత్వంతో మాట్లాడి ప్రజలకు మంచి చేసే పథకాలు ప్రకటిస్తాం. ప్రజల నమ్మకాన్ని ఒడిసి పట్టుకున్న నేతను నేను. రాష్ట్రంలో నన్ను గుర్తుపట్టని వారు ఎవరూ లేరు. హుజూరాబాద్‌లో 6 వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నన్ను ఓడించేందుకు కేసీఆర్ ప్రయత్నం చేశారు. నా ఫొటో హుజూరాబాద్ ప్రజల గుండెల్లో ఉంటుంది. నేను కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తానని కొంతమంది భావిస్తున్నారు. రైతు బంధు పథకం చిన్న రైతులకు అమలు చేయాలని నేను మంత్రిగా ఉన్నప్పుడే చెప్పాను. లాబీయింగ్‌తోనే కొంతమంది బతుకుతుంటారు. ఎవరైనా లంచ్ మీటింగ్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు” అని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# మహిళ బిల్లు మంచిదే కానీ..: తమ్మినేని వీరభద్రం



హైదరాబాద్: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేంద్రం తీసుకువచ్చిన మహిళ బిల్లు మంచిదే కానీ.. బిల్లులో పెట్టిన ప్రొవిజన్స్ కొంత ఇబ్బంది కలిగించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ సీపీఎం కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ బీజేపీకి అభిమానముంటే మహిళా రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలన్నారు. అక్టోబర్ 1న కమ్యూనిస్టులు పోటీచేసే అసెంబ్లీ స్థానాలను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఎంఐఎం థర్డ్ ఫ్రంట్ ఆలోచన అంత బీజేపీ కోసమేనని, బీజేపీ కోసం ఎంఐఎం చాలా రాష్ట్రాల్లో పోటీచేసి ఓట్లు చీల్చిందని తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. బీజేపీకు సహకరించేలా బీఆర్ఎస్ అధినేత, సీఎం కెసీఆర్ ఆలోచన ఉందని.. ఇండియా కూటమిని కాదని పరోక్షంగా బీజేపీకి కేసీఆర్ సపోర్ట్ చేస్తున్నారని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టులుగా పోరాటం చేస్తామని తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో దేవాలయాల అభివృద్ధి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ : సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రంలో దేవాలయాలకు పూర్వ వైభవం వచ్చింది. రాష్ట్రాన్ని ఆధ్యాత్మిక తెలంగాణగా మారుస్తున్నారు. యదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయాన్ని పునః నిర్మించి చారిత్రాత్మక కార్యక్రమానికి శ్రీకార చుట్టారని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల రంగంపేటలో రూ.3 కోట్లతో నిర్మించిన దేవాదాయ శాఖ సమీకృత భవన సముదాయన్ని మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్, నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..సర్వే నెంబర్.725 ఓపెన్ ల్యాండ్‌లో సెంట్రల్ జైలు, వరంగల్ ఎదురుగా 1014 చదరపు గజాలలో దేవాదాయ శాఖ కార్యాలయ భవనం నిర్మాణం చేపట్టారు.

నేడు దేవాదాయ శాఖ సమీకృత భవనాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాలుగు అంతస్తులతో నిర్మించిన ఈ భవనంలో మొదటి అంతస్తులో డిప్యూటీ కమిషనర్, ఎండోమెంట్స్, వరంగల్ జోన్, రెండవ అంతస్తులో అసిస్టెంట్ కమిషనర్, ఎండోమెంట్స్, వరంగల్, మూడవ అంతస్తులో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎండోమెంట్స్, వరంగల్, నాలుగవ అంతస్తులో ఈ.ఓ., శ్రీసమ్మక్క–సారలమ్మ జాతర, మేడారం కార్యాలయాలు ఉంటాయన్నారు. ఇవన్నీ ఒకే చోట ఉండడం వల్ల పరిపాలన సౌలభ్యమే కాక సందర్శకులకు వివిధ పనుల మీద వచ్చే వాళ్లందరికీ ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. గతంలో అత్యంత నిర్లక్ష్యానికి గురైన మన దేవాలయాలు, మన కవులు, కళాకారులకు తెలంగాణ వచ్చాకే..తగిన గౌరవం, గుర్తింపు దక్కింది. నేడు కనీవినీ ఎరుగని రీతిలో దేవాలయాల అభివృద్ధి జరుగుతున్నదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్, జిల్లా కలెక్టర్ సిక్తపట్నాయక్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# ఖైరతాబాద్ గణపతిని దర్శించుకున్న వెంకయ్య

హైదరాబాద్: ఖైరతాబాద్ 63 అడుగుల దశమహా విద్య గణపతిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెంకయ్య నాయుడు మాట్లాడారు. “కుటుంబ సమేతంగా వచ్చి.. బడా గణేష్‌ని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉంది. శాసన సభ్యులుగా ఉన్నప్పటి నుంచి గణేష్‌ని దర్శించుకుంటున్నా. ప్రజలు అందరు సుఖంగా సంతోషంగా ఉండాలి అని గణపతిని ప్రార్థించా. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ్ కమిటీ చైర్మన్ సింగారి సుదర్శన్ ప్రస్తుతం మనతో లేకపోవడం బాధగా ఉంది. ప్రతి ఒక్కరికి దైవ భక్తి వల్ల సంతృప్తి కలుగుతుంది. దేశంలో సమైక్యత, గురుభావం, దైవ భక్తి పెరుగుతుంది. భారత దేశం శక్తివంతంగా తయారవుతుంది. ఇలానే దేశం ముందుకు వెళ్లాలని కోరుకొంటున్నా.” అని వెంకయ్య తెలిపారు.

# హైదరాబాద్ అభివృద్ధి రజినీకి అర్థమైంది.. కానీ గజినీలకు కావట్లేదు.. ప్రతిపక్షాలపై మంత్రి హరీశ్ రావు సెటైర్



గోదావరి, కృష్ణా జలాలను తీసుకొచ్చి హైదరాబాద్‌లో తాగునీటి కొరతను సీఎం కేసీఆర్ తీర్చారని మంత్రి హరీశ్‌రావు చేశారు. 60 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఈ పని చేయలేకపోయాయని అన్నారు.

పేదలందరికీ ఉచితంగా మంచినీటిని బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పరిధిలోని కొల్లూరులో రెండో విడత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇండ్లు కట్టడం అంటే అప్పుల్లో కూరుకుపోవడమే అన్నట్లుగా ఉండేదన్నారు. మహిళల కోసం సీఎం కేసీఆర్ చాలా పథకాలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ కిట్లు ఇస్తే.. ప్రతిపక్షాలు తిట్టిపోస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ధర్నాలు తప్ప ఏమీ జరగలేదని గుర్తు చేశారు. కొల్లూరు టౌన్‌షిప్‌లో విద్య, వైద్యం, రవాణా సదుపాయం కల్పిస్తామని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారు. హైదరాబాద్ అభివృద్ధి గురించి రజినీకాంత్‌కు అర్థమైంది కానీ.. మన దగ్గర ఉన్న గజినీలకు అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలే ప్రచారం చేయాలని అన్నారు. హైదరాబాద్‌లో లక్షమందికి డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి పేదవాడికి పక్కా ఇండ్లు ఇస్తామని.. పేదలు ఆత్మగౌరవంతో ఉండేలా చేస్తామని భరోసానిచ్చారు.

ఎన్నికలు వస్తున్నాయంటే హామీలు, నినాదాలు చేస్తూ మీ దగ్గరికి వస్తుంటారని అన్నారు. దొంగ డిక్లరేషన్ చేస్తూ.. ఓట్ల కోసం వస్తున్నారన్నారు. ఎన్ని డిక్లరేషన్‌లు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీకే ఓట్లు వేస్తామని సెల్ఫ్ డిక్లరేషన్ చేసుకున్నారని స్పష్టం చేశారు. పాలమూరు ప్రాజెక్టులో ఏపీ అక్రమంగా వేసిన కేసు కొట్టుడు పోయాయని అన్నారు

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చరిత్రలో నిలిచిపోతాయి : మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్ : తెలంగాణ సాధన కోసం తన మంత్రి పదవిని సైతం త్యజించిన మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ. 90 సంవత్సరాల వయసులో తెలంగాణ సాధన కోసం గడ్డకట్టే చలిలో ఢిల్లీలో ఉద్యమం చేసిన ఘనత ఆయనది. ఆ మహనీయుడి సేవలు తెలంగాణకే గర్వకారణమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌అన్నారు. భారత స్వాతంత్ర పోరాట, తెలంగాణ ఉద్యమ నేత, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా మంత్రి కరీంనగర్‌లోని ఆ మహనీయుని విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవల్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కొండా లక్ష్మణ్ బాపూజీ. తన జీవితాంతం బలహీన వర్గాల కోసం సేవ చేసిన ఘనత ఆయనదని ప్రశంసించారు. ఆయనతో పాటు తెలంగాణ ఉద్యమంలో నేను పాల్గొనడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను ఆయన కండ్లతో చూడకపోవడం బాధాకరమన్నారు. బాపూజీని గౌరవించుకుంటే మనల్ని మనం గౌరవించుకున్నట్టేనని తెలిపారు. అందులో భాగంగా ? తెలంగాణ ప్రభుత్వం బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహిస్తుందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో విగ్రహాలను ఏర్పాటు చేసి ఆయన చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఆ మహనీయుడి ఆశయాల సాధనకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు. గాలి, నీరు ఉన్నంత వరకు కొండ లక్ష్మణ్ బాపూజీ పేరు చరిత్రలో నిలిచిపోతుంది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఒక్క కులానికో.. మతానికో చెందిన వారు కాదని, ఆయన యావత్ తెలంగాణకే ఆస్తి అని అన్నారు.

# ప్రజల కష్టాలన్నింటికి కాంగ్రెస్ పార్టీనే కారణం : మంత్రి కొప్పుల

జగిత్యాల : దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎలాంటి అభివృద్ధి చేయలేదు. ఇప్పుడు అభివృద్ధి చేస్తాం అవకాశం ఇవ్వండని అడగటం ఆ పార్టీ దివాళకోరుతనానికి నిదర్శనమని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా ధర్మపురి నియోజకవర్గం పెగడపల్లి మండలం దీకొండ, ల్యాగలమర్రి, నంచర్ల గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించాగా మంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. నంచర్ల గ్రామానికి చెందిన బీజేపీ ఓసీబీ మోర్చా జిల్లా కార్యదర్శి హరిగోపాల్, కాంగ్రెస్ పార్టీ ఐదవ వార్డు సభ్యురాలు చేపూరి ఉమారాణి, 20 మంది కార్యకర్తలు మంత్రి కొప్పుల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నంచర్ల గ్రామాలో మంత్రి అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంటు, సాగునీటికి ఇబ్బందులు పడ్డది నిజం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాలుగు రాష్ట్రాలల్లో అధికారంలో ఉంది. అక్కడ రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు కల్యాణలక్ష్మి వంటి పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. ముందు అక్కడ అమలు చేసి తెలంగాణలో మాట్లాడాలని హితవు పలికారు. ప్రజల అభివృద్ధికి పాటుపడుతున్న బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# జీనోమ్ వ్యాలీని మరో 250 ఎకరాల్లో విస్తరిస్తాం : మంత్రి కేటీఆర్

దేశంలోనే అత్యంత మానవ వనరులు కలిగిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ శివారులోని జీనోమ్ వ్యాలీలో బీఎస్‌వీ కంపెనీ కొత్త యూనిట్‌కు మంత్రి కేటీఆర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. భారత్ సీరం సంస్థకు అన్నిరకాల సహకారం అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం జీనోమ్ వ్యాలీలో ఫేజ్–3లో ఉన్నామని.. దీన్ని మరో 250 ఎకరాల్లో విస్తరిస్తామని మంత్రి కేటీఆర్ సందర్భంగా ప్రకటించారు. దేశంలో ఎక్కడా లేని అనుకూలతలు తెలంగాణలో ఉన్నాయని మంత్రి కేటీఆర్ అన్నారు.. ఎక్కడా లేనంత వేగంగా పారిశ్రామికీకరణ, ఉపాధి కల్పనలో తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందనడం నిర్వివాదమని పేర్కొన్నారు. మాకు కేంద్ర ప్రభుత్వానికి పడదు.. తెల్లారిలేస్తే మేమూ, వాళ్లూ తిట్టుకుంటాం.. విమర్శలు చేసుకుంటాం. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎప్పుడు ఏదో పంచాయితీ నడుస్తూనే ఉంటుంది.. అయినప్పటికీ ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో నంబర్‌వన్ ఎవరని అడిగితే తెలంగాణ అని వాళ్లు కూడా ఒప్పుకునే పరిస్థితిని సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని అన్నారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందన్నారు. దేశ సగటు తలసరి ఆదాయం 1,49,000 ఉండగా.. తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,17,000గా ఉందన్నారు. సమర్థవంతమైన నాయకత్వం ఉంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని తెలంగాణ ప్రభుత్వం నిరూపిస్తోందని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రపంచానికి వ్యాక్సిన్ రాజధానిగా హైదరాబాద్ మారిందని ప్రపంచంలో ఎక్కడికెళ్లినా గర్వంగా చెప్పగలనని పేర్కొన్నారు. ప్రపంచంలో తయారయ్యే వ్యాక్సిన్లలో 33 శాతం హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి అవుతున్నాయని అన్నారు. హైదరాబాద్‌లో ఏడాదికి 900 కోట్ల వ్యాక్సిన్లు ఉత్పత్తి అవుతున్నాయని అన్నారు. వచ్చే ఏడాది నుంచి 1400 కోట్ల వ్యాక్సిన్లు ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతాయని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 50 శాతం మనదే అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. దీనికి నిపుణులైన యువకులు ఉండటం, వాళ్లను చూసి కంపెనీలు ఇక్కడికి రావడం, వారికి ప్రభుత్వం సహకరించడమే కారణమని అన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com